RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 74 | ఏప్రిల్ 03 శుక్రవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 74 | April 03 Fryday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


ఆర్డర్లు రద్దు కమిషన్ల కోసమే

2

# గ్రామసభల సందడి

**ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సందేశం**



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి పంపిన ప్రత్యేక సందేశాన్ని అధికారులు చదివి వినిపిస్తున్నారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాల మూడు నెలలు పూర్తయిన సందర్భంగా, గత పాలకుల లోపాలను సవరించుకుంటూ, ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ సంక్షేమం, అభివృద్ధి పథంలో రాజీ పడకుండా ముందుకు సాగుతున్నామని సీఎం తన సందేశంలో స్పష్టం చేశారు. తాము పాలకులము కాదు, ప్రజల సేవకులమన్న భావనతోనే ప్రతి నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. వరుసగా జరిగిన ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు అందించిన విజయాలు ప్రభుత్వ బాధ్యతను మరింత పెంచాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పథకాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, సామాన్యుల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్నదే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే మార్చి 6 నుండి ప్రారంభమైన 99 రోజుల ప్రణాళికను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, ఫైళ్ల వేగవంతమైన క్లియరెన్స్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్,

మిగతా 2వ పేజిలో..

# కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై హరీష్ రావు నిప్పులు

**తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని విమర్శ**



హైదరాబాద్ : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా చరిత్రను వక్రీకరిస్తూ తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజ్యసభలో కిషన్ రెడ్డి మాట్లాడిన మాటలు పచ్చి అబద్ధాలని, ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించడం విభజన చట్టంలోనే ఉందనడం చారిత్రక అవాస్తవమని ఆయన కొట్టిపారేశారు. విభజన చట్టానికి సవరణలు తెచ్చి, ఆర్డినెన్స్ ద్వారా ఆ ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికి బీజేపీ ప్రభుత్వమేనని హరీష్ రావు విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజీనామా చేయకుండా వెన్నుచూపి పారిపోయిన కిషన్ రెడ్డి, ఇప్పుడు పార్లమెంట్‌లో రేవంత్ రెడ్డి చేస్తున్న దుష్ప్రచారాన్ని వల్లెవేస్తూ విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీల మధ్య ఉన్న చీకటి పొత్తుకు కిషన్ రెడ్డి వ్యాఖ్యలే నిదర్శనమని,

మిగతా 2వ పేజిలో..

# బంగారం ధరల్లో భారీ తగ్గుదల

**పసిడి ప్రియులకు ఊరట**



**న్యూఢిల్లీ/హైదరాబాద్:** గత కొంతకాలంగా సామాన్యులకు చుక్కలు చూపిస్తున్న పసిడి ధరలకు ఒక్కసారిగా బ్రేక్ పడింది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో బంగారం ధరలు మరింత పెరుగుతాయని ఆందోళన చెందుతున్న తరుణంలో, మార్కెట్‌లో అనూహ్యంగా ధరలు దిగిరావడం కొనుగోలుదారులకు తీపికబురుగా మారింది. నిన్నటి వరకు రికార్డు స్థాయిల్లో కొనసాగిన పసిడి ధరలు, కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే భారీగా పతనమయ్యాయి. ముఖ్యంగా పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్

# గ్రామీణాభివృద్ధికి కేంద్రం పెద్దపీట

**పంచాయతీ నిధుల విడుదలపై మంత్రి కిషన్ రెడ్డి హర్షం**



హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత నిధుల విడుదలపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, తెలంగాణలోని గ్రామ పంచాయతీల కోసం కేంద్రం రూ. 619.85 కోట్లు కేటాయించడాన్ని స్వాగతించారు. 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' మంత్రంతో ప్రతి గ్రామం సమగ్రాభివృద్ధి సాధించాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, ఈ నిధుల విడుదలకు సహకరించిన ప్రధాని మోదీకి మరియు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం విడుదల చేసిన ఈ నిధుల్లో రూ. 371.91 కోట్లు టైడ్ గ్రాంట్ కింద, రూ. 247.94 కోట్లు అన్ టైడ్ గ్రాంట్ కింద ఉన్నాయని ఆయన వివరించారు. ఈ నిధులతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచుకోవచ్చని, స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామసభల ద్వారా నిర్ణయాలు తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టవచ్చని పేర్కొన్నారు. ఆర్థిక సంఘం నిబంధనల ప్రకారం, కేంద్రం నుండి నిధులు అందిన పది పనిదినాలలోపు రాష్ట్ర ప్రభుత్వం ఆయా పంచాయతీలకు బదిలీ చేయాల్సి ఉంటుందని, ఒకవేళ ఆలస్యమైతే వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుందని

మిగతా 2వ పేజిలో..

# అంతరిక్షంలో మరో కీలక ప్రయోగం



**న్యూఢిల్లీ**

అంతరిక్ష ప్రయోగంలో మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. 50 ఏండ్ల తర్వాత చంద్రుడి వద్దకు మానవులను పంపేందుకు ఉద్దేశించిన 'ఆర్టెమిస్-2'ను అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) ప్రయోగించింది. బుధవారం సాయంత్రం 6.35 గంటలకు (అమెరికా కాలమానం ప్రకారం) నలుగురు వ్యోమగాములతో కూడిన 'ఓరియన్' రాకెట్ ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి జాబిల్లి దిశగా నింగిలోకి దూసుకెళ్లింది. ఆర్టెమిస్ ప్రోగ్రామ్‌లో భాగంగా వ్యోమగాముల సహితంగా అమెరికా జరుపుతున్న మొదటి ప్రయోగం ఆర్టెమిస్ నే కావడం విశేషం. చంద్రుడి వద్దకు తొలిసారిగా ఓ మహిళ, ఓ నల్లజాతీయుడు, ఓ కెనడియన్ ఇందులో వెళ్తున్నారు. మిషనల్ భాగంగా ఓరియన్ రాకెట్ చంద్రుడి

మిగతా 2వ పేజిలో..

# జలసంధిని తెరిపిద్దాం రండి

**ప్రపంచ దేశాలను కోరిన బ్రిటన్**

**న్యూఢిల్లీ**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, ఇంధన సరఫరాకు అత్యంత కీలకమైన 'హార్ముజ్ జలసంధి' మూసివేతతో చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ ఈ జలసంధిని దిగ్బంధించిన విషయం తెలిసిందే. దీన్ని తిరిగి తెరిపించేందుకు బ్రిటన్ ఆధ్వర్యంలో 35 దేశాలు ఏకమయ్యాయి. ఈనేపథ్యంలో యూకే నుంచి హార్ముజ్ జలసంధి తెరవడం కోసం జరుగనున్న వర్చువల్ మీటింగ్‌కి భారత్‌కి ఆహ్వానం అందింది. దీంతో ఈ ప్రతిష్టాత్మక ప్రయత్నంలో భారత్ కూడా భాగస్వామి అవుతోందని భారత విదేశాంగ శాఖ (వీజూా) గురువారం వెల్లడించింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియాతో మాట్లాడుతూ..

# ఎంపీ రాఘవచద్దా పదవీ తొలగింపు

**న్యూఢిల్లీ**

ప్రజల సమస్యలపై పార్లమెంట్‌లో గొంతెత్తుతున్న ఎంపీ రాఘవ్‌చద్దా కు ఆమ్ ఆద్మీ పార్టీ షాకిచ్చింది. రాజ్యసభలో ఆప్ డిప్యూటీ లీడర్ పదవి నుంచి చద్దాను తొలగించింది. ఆయన స్థానంలో పంజాబ్‌కు చెందిన ఎంపీ అశోక్ మిట్టల్ ను నియమించింది. ఈ మేరకు రాజ్యసభ సెక్రటేరియట్‌కు లేఖ రాసింది. అంతేకాదు, సభలో చద్దాకు మాట్లాడేందుకు సమయం ఇవ్వొద్దని కోరింది. ఆప్ నిర్ణయంతో పార్టీలో అంతర్గత విభేదాలు ఉన్నాయన్న వదంతులు తెరపైకి వచ్చాయి.

## గ్రామసభల సందడి

**మొదటిపేజీ తరువాయి..** ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా ఈ కార్యక్రమం నిరంతరం పర్యవేక్షిస్తుందని సీఎం హామీ ఇచ్చారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌తో రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలపాలన్నది తన కల అని, ఆ దిశగా క్యూర్ , ప్యూం, రేర్ అనే వర్గీకరణతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ బిడ్డలందరూ ఈ ప్రగతి ప్రస్థానంలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై హరీష్ రావు నిప్పులు

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ గొంతు కోయడంలో ఇద్దరూ ఒక్కటయ్యారని ఆయన ఆరోపించారు. ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరం ప్రాజెక్టుపై గతంలో బీజేపీ పెద్దలే ప్రశంసలు కురిపించారని, ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం అబద్ధాలు ఆడటం సిగ్గుచేటని హరీష్ రావు వ్యాఖ్యానించారు. మండుటెండల్లో సైతం కాళేశ్వరం జలాలు రైతుల పొలాలకు చేరుతున్నాయని, ఈ విషయాన్ని నిరూపించేందుకు తాను సిద్ధమని, కిషన్ రెడ్డికి దమ్ముంటే రావాలని సవాల్ విసిరారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 'ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా' నివేదికలోనే తెలంగాణలో సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాల నుండి 2.2 కోట్ల ఎకరాలకు పెరగడానికి కాళేశ్వరం, మిషన్ కాకతీయే కారణమని పేర్కొన్న విషయం కేంద్ర మంత్రికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. విభజన హామీల అమలుపై ఎంపీ సురేష్ రెడ్డి బాధ్యతగా మాట్లాడుతుంటే, దానికి మద్దతు ఇవ్వకుండా వ్యర్థ ప్రేలాపనలకు పాల్పడటం సరికాదన్నారు. రాష్ట్రం నుండి 16 మంది ఎంపీలు ఉన్నప్పటికీ తెలంగాణ వాదాన్ని వినిపించకుండా అణచివేయడం దురదృష్టకరమని హరీష్ రావు తన ప్రకటనలో పేర్కొన్నారు.

## గ్రామీణాభివృద్ధికి కేంద్రం పెద్దపీట

**మొదటిపేజీ తరువాయి..** మంత్రి గుర్తు చేశారు. తెలంగాణలో గతంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఆలస్యం కారణంగా రెండేళ్ల నిధులు పెండింగ్‌లో పడ్డాయని, ఇటీవల ఎన్నికలు పూర్తి కావడంతో కేంద్రం నిధులను విడుదల చేసిందని ఆయన వివరించారు. గతంలో బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించినప్పటికీ, గ్రామాల ప్రయోజనం దృష్ట్యా వినియోగ ధృవీకరణ పత్రాలు (ఖజం) అందగానే కేంద్రం నిధులను కేటాయిస్తోందని కిషన్ రెడ్డి వెల్లడించారు. రాబోయే 16వ ఆర్థిక సంఘం ద్వారా 2026-27 నుంచి 2030-31 మధ్య కాలంలో తెలంగాణ పంచాయతీలకు సుమారు రూ. 9,968 కోట్ల గ్రాంట్లు అందనున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పిస్తే నిధుల విడుదలకు కేంద్రం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయన తన ప్రకటనలో పునరుద్ఘాటించారు.

## బంగారం ధరల్లో భారీ తగ్గుదల

**మొదటిపేజీ తరువాయి..** నడుస్తున్న సమయంలో ఈ తగ్గుదల సామాన్యులకు పెద్ద ఊరటనిస్తోంది. బులియన్ మార్కెట్ గణాంకాల ప్రకారం, 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములపై రూ. 1,530 మేర తగ్గి ప్రస్తుతం రూ. 1,51,420 వద్ద ట్రేడ్ అవుతోంది. అదేవిధంగా ఆభరణాల తయారీలో ఎక్కువగా ఉపయోగించే 22 క్యారెట్ల బంగారం ధరపై రూ. 1,400 తగ్గి రూ. 1,38,800 వద్దకు చేరుకుంది. ఇక 18 క్యారెట్ల బంగారంపై కూడా రూ. 1,440 మేర తగ్గింపు కనిపించడంతో దీని ధర రూ. 1,13,570 వద్ద కొనసాగుతోంది. బంగారంతో పాటే వెండి ధరలు కూడా భారీగా దిగొచ్చాయి. దేశవ్యాప్తంగా కిలో వెండిపై ఏకంగా రూ. 5,000 మేర భారీ పతనం నమోదైంది. దీంతో ఢిల్లీ, ముంబై, కోల్‌కతా మరియు బెంగళూరు వంటి నగరాల్లో కిలో వెండి ధర రూ. 2,50,000 కు చేరుకోగా, హైదరాబాద్ మరియు చెన్నై వంటి నగరాల్లో మాత్రం ధర రూ. 2,55,000 వద్ద ట్రేడ్ అవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకున్న పరిణామాల ప్రభావంతోనే దేశీయంగా ఈ భారీ తగ్గుదల కనిపిస్తోందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## అంతరిక్షంలో మరో కీలక ప్రయోగం

**మొదటిపేజీ తరువాయి..** ఉపరితలానికి అత్యంత సమీపంగా వెళ్లి, దాన్ని చుట్టి రానుంది. నలుగురు వ్యోమగాములు పది రోజులపాటు రాకెట్‌లోనే ప్రయాణిస్తారు. చంద్రుడి కక్ష్యపై పరిశోధనలు జరిపి తిరిగి భూమిపైకి వస్తారు. వ్యోమగాములు పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండ్ అయ్యేలా నాసా ఏర్పాట్లు చేస్తున్నది. ఈ ప్రయోగం విజయవంతమైతే భవిష్యత్తులో జాబిల్లిపైకి మానవులను పంపించే మార్గం సుగమం అవుతుంది.

## జలసంధిని తెరిపిద్దాం రండి

**మొదటిపేజీ తరువాయి..** బ్రిటన్ ఆహ్వానం మేరకు గురువారం సాయంత్రం జరిగే వర్చువల్ సమావేశంలో భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పాల్గొంటారని తెలిపారు. "మా నౌకల సురక్షిత ప్రయాణం కోసం ఇరాన్ సహా ఇతర దేశాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. మా ప్రయత్నాల వల్ల గత కొద్ది రోజుల్లో ఎల్పీజీ, ఎల్ఎన్‌జీ వంటి ఉత్పత్తులతో ఉన్న 6 భారతీయ వాణిజ్య నౌకలు సురక్షితంగా హార్ముజ్ జలసంధిని దాటాయి. అన్ని ర్గాలతోనూ మేము టచ్‌లో ఉన్నాం" అని ఆయన వివరించారు.

ప్రపంచంలోని మొత్తం ఇంధన సరఫరాలో 20 శాతం ఈ ఇరుకైన జల మార్గం గుండానే జరుగుతుంది. ముఖ్యంగా భారత్‌కు ఇది చాలా కీలకం. దేశంలోకి దిగుమతి అయ్యే మొత్తం చమురులో 40 శాతం, లో 50 శాతం, ఎల్పీజీ లో ఏకంగా 80 శాతం ఈ మార్గం ద్వారానే రవాణా అవుతాయి. ఇది మూసుకుపోతే ఇంధన కొరతతో పాటు ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉంది.

చేతులెత్తేసిన డొనాల్డ్ ట్రంప్.. షాకింగ్ కామెంట్స్

జలసంధిని తెరిపించడమే తన ప్రధాన లక్ష్యమని గతంలో పదేపదే చెప్పిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇప్పుడు మాట మార్చారు. మిత్రదేశాలకు ఇకపై సాయం చేయబోనని తేల్చిచెప్పారు. తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' (ఠతీబ్ష్ర ూశీఎఱఝశ్రీ) వేదికగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

"ఇరాన్‌తో యుద్ధంలో మాకు సాయం చేయడానికి నిరాకరించిన బ్రిటన్ లాంటి దేశాలు.. ఇప్పుడు జెట్ ఇంధనం దొరకక ఇబ్బంది పడుతున్నాయి. మీకు నావి రెండు సలహాలు.. ఒకటి, చమురును అమెరికా దగ్గర కొనండి, మా వద్ద చాలా ఉంది. రెండు, కాస్త ధైర్యం తెచ్చుకుని వెళ్లి ఆ జలసంధిని మీరే ఆక్రమించుకోండి. ఇకపై అమెరికా మీకు సాయం చేయడానికి రాదు. మీ కోసం మీరు పోరాడటం నేర్చుకోండి. ఇరాన్‌ను మేం ఇప్పటికే నాశనం చేశాం. కష్టమైన పనంతా మేమే చేశాం. వెళ్లి మీ చమురు మీరే తెచ్చుకోండి!" అని ట్రంప్ పోస్ట్ చేశారు.

బ్రిటన్ ఆధ్వర్యంలో భారీ కూటమి

ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ (ఖవఱతీ ఞ్ఘతీఎవతీ) రంగంలోకి దిగారు. సముద్ర భద్రతను పునరుద్ధరించేందుకు ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, కెనడా, యూఏఈ సహా 35 దేశాలు అంగీకరించాయని వెల్లడించారు.

"నౌకల స్వేచ్ఛా ప్రయాణాన్ని పునరుద్ధరించడానికి, చిక్కుకుపోయిన నౌకలు, నావికులకు రక్షణ కల్పించడానికి, సరుకుల రవాణాను తిరిగి ప్రారంభించడానికి అవసరమైన అన్ని దౌత్య, రాజకీయ చర్యలపై ఈ సమావేశంలో చర్చిస్తాం. యుద్ధం ముగిసిన తర్వాత ఆ మార్గంలో భద్రత కల్పించడంపై సైనిక నిపుణులతో కూడా చర్చిస్తాం" అని ఆయన తెలిపారు.

బ్రిటన్ విదేశాంగ మంత్రి వైవెట్ కూపర్ అధ్యక్షతన జరిగే ఈ 35 దేశాల సమావేశం తర్వాత.. తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు అధికారుల స్థాయిలో మరిన్ని భేటీలు జరగనున్నట్లు సమాచారం.

## ఎంపీ రాఘవచద్దా పదవీ తొలగింపు

**మొదటిపేజీ తరువాయి..** ముఖ్యంగా పార్టీకి, ఎంపీ రాఘవ్ చద్దాకు మధ్య విభేధాలు వచ్చాయనే వార్తల నేపథ్యంలో ఆప్ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈ వదంతులను అశోక్ మిట్టల్ కొట్టిపారేశారు. ప్రతి ఒక్కరికీ అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

కాగా, పార్టీ వ్యవహారాల విషయంలో రాఘవ్ చద్దా ఎప్పుడూ దూరంగానే ఉంటారన్న విమర్శలు ఉన్నాయి. అంతేకాదు, ఆప్, పార్టీ అగ్ర నాయకత్వానికి సబంధించిన కీలక పరిణామాలపై ఆయన మౌనం వహిస్తుండటం కూడా పార్టీ అధిష్ఠానానికి నచ్చడం లేదు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో కూడా తాజా పరిణామాలపై చద్దా స్పందించలేదు. అయితే, అప్పుడు కంటి ఆపరేషన్ కారణంగా యూకేలో ఉన్న విషయం తెలిసిందే.

మరోవైపు ఈ ఏడాది ఫిబ్రవరిలో మద్యం కుంభకోణం కేసులో ఆప్ అధినేత కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఇతరులను కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పుడు కూడా చద్దా బహిరంగంగా స్పందించలేదు. అంతేకాదు సోషల్ మీడియాలో కూడా ఎలాంటి పోస్టూ చేయలేదు. దీంతో ఎంపీ వ్యవహారశైలిపై పార్టీ అధిష్ఠానం ఆగ్రహంతో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఆయనపై చర్యలు తీసుకున్నట్లు టాక్ వినిపిస్తోంది.

## కమీషన్ల కోసమే టెస్కోకు ఆర్డర్లు రద్దు

**ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరుపై కెటిఆర్ విమర్శలు**

**హైదరాబాద్, ఏప్రిల్2 :** ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు సంస్థలకు వత్తాసు పలకడమేనా ప్రజా పాలనా..అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. టెస్కోకు విద్యాశాఖ షాక్ అని ఓ ప్రముఖ దినపత్రికలో వచ్చిన కథనాన్ని ఎక్స్‌లో కేటీఆర్ ట్యాగ్ చేస్తూ రేవంత్ సర్కార్ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ టెస్కోకు ఆర్డర్లు రద్దు చేసి ప్రైవేట్ కంపెనీలకు ఇచ్చి చేనేత సంఘాల కార్మికుల పొట్ట కొడుతుందని.. ఇది ప్రజా ప్రభుత్వమా.. లేక 'ప్రైవేట్' లిమిటెడ్ కంపెనీయా..? అని మండిపడ్డారు. రూ. 105 కోట్ల విలువ గల స్కూల్ యూనిఫామ్ ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. సంక్షేమ శాఖ నుండి టెస్కోకు దక్కాల్సిన రూ. 200 కోట్ల దుస్తులు, దుప్పట్ల ఆర్డర్ ఇంకా ఇవ్వకపోవడం వెనుక కారణం ఏంటి..? అని అడిగారు.కాంగ్రెస్ దండుపాళ్యం ముఠా కమిషన్లు దండుకోవాలనే యావలో ప్రైవేట్ వ్యక్తులకు ఆర్డర్లు ఇస్తున్నదని ధ్వజమెత్తారు. నేతన్నల ఉసురు పోసుకుంటున్న కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

## పర్సెంటేజీల ప్రకారమే సినిమాల ప్రదర్శన

**నేటి నుంచే ఈ విధానం అమలు**

**23 సింగల్ స్క్రీన్ థియేటర్ యాజమాన్యాల ప్రకటన**

**హైదరాబాద్, ఏప్రిల్2 :** తెలంగాణ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. మల్టీప్లెక్స్ తరహాలో పర్సంటేజీ విధానంలోనే సినిమాలను ప్రదర్శించాలని హైదరాబాద్‌లోని 23 సింగిల్‌స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాలు నిర్ణయించాయి. ఏప్రిల్ 3 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఎగ్జిబిటర్లకు రెవెన్యూ షేర్ ఇలా.. సినిమా ప్రదర్శితమైన తొలివారం 60 శాతం, రెండోవారం 50 శాతం, మూడోవారం 40 శాతం. ఈ మేరకు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రకటన విడుదల చేసింది. 23 మంది ఎగ్జిబిటర్లు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఇటీవల సంప్రదించి.. తెలంగాణలోని పలువురు అగ్ర శ్రేణి డిస్టిబ్యూటర్లతో చర్చలు జరిపినట్లు తెలిపారు. వారి థియేటర్లు ముఖ్యమైన ప్రదేశాల్లో ఉన్న ప్రీమియం థియేటర్లని, వాటిలో ప్రేక్షకులకు అన్ని సౌకర్యాలున్నాయని, అయితే ఈ థియేటర్ల నిర్వహణకు చాలా ఖర్చవుతోందన్నారు. ప్రస్తుత అద్దె విధానంతో వారు మనుగడ సాగించలేకపోతున్నామని తెలిపారు. పర్సంటేజీ ప్రాతిపదికన సినిమాలను ప్రదర్శిస్తామన్న తమ ప్రపోజల్‌ను డిస్టిబ్యూటర్లు అంగీకరించారని చెప్పారు. శశిధర్ రెడ్డి మాత్రమే నిర్మాతలు, ఇతర భాగస్వాములతో మరింత చర్చించి, ఆ తర్వాత అభిప్రాయం చెబుతామన్నారని పేర్కొన్నారు. ఇకపై తెలంగాణలోని అన్ని సింగిల్ స్క్రీన్‌లలో సినిమాలను కేవలం శాతం ప్రాతిపదికనే ప్రదర్శిస్తామని, ఇది విడతల వారీగా జరుగుతుందని ఎగ్జిబిటర్లు తెలిపారని ఫిల్మ్ ఛాంబర్ ప్రకటనలో పేర్కొంది. మార్చి 11న బెంగళూరులో జరిగిన దక్షిణ భారత ఎగ్జిబిటర్ల సమావేశం లోనూ దీనిపై ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. మన తెలుగు రాష్ట్రాలు మినహా దేశంలోని అన్ని రాష్ట్రాల సింగిల్ స్క్రీన్‌లు పర్సంటేజీ విధానాన్ని మాత్రమే అనుసరిస్తున్నాయి. సింగిల్ స్క్రీన్‌ల మనుగడ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని డిస్టిబ్యూటర్లు, సినీ నిర్మాతలకు ఫిల్మ్ ఛాంబర్ తెలిపింది. రెంటల్ విధానానికి బదులు పర్సంటేజీ విధానంలో సినిమాల ప్రదర్శన కోసం ఎప్పటి నుంచో ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు 23 థియేటర్ల యాజమాన్యాలు ముందడుగు వేశాయి.

## చికెన్ షాపులకు 40 మార్జిన్ ఇస్తున్నాం

**కొందురు కావాలనే తప్పుదోవ పట్టిస్తున్నారు**

**బ్రాయిలర్ ఇంటిగ్రేషన్ కో ఆర్డనేషన్ కమిటీ వెల్లడి**

**హైదరాబాద్,ఏప్రిల్2 :** చికెన్ రేటు మార్జిన్ విషయంలో చికెన్ రిటైల్ షాపు వ్యాపారులు పొంతన లేకుండా వ్యవహరిస్తున్నారని బ్రాయిలర్ ఇంటిగ్రేషన్ కో ఆర్డనేషన్ కమిటీ తెలిపింది. రిటైల్ షాపుల ఆరోపణలపై హైదరాబాద్ సోమాజిగూడాలో గురువారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు రామిరెడ్డి , బాలసుబ్రహ్మణ్యన్ , రాజిరెడ్డి లు మాట్లాడారు. చికెన్ లైవ్ రేట్ తో పాటు రిటైల్ ధరలను పేపర్ ద్వారా ప్రకటనలు ఇస్తున్నామని తెలిపారు. గత కొన్నేళ్లుగా కిలోకు 40 రూపాయలు మార్జిన్ ఇస్తున్నామని , కరోనా సమయంలో కూడా అంతే ఇచ్చామని తెలిపారు. బంద్ లో ఉన్న వ్యాపారులు కిలోకు 30 రూపాయలు అడుగుతున్నారని... తాము 40 ఇస్తున్నామన్నారు. కొందరు కావాలనే వ్యాపారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కంపెనీలు నష్టాల్లో ఉన్నా కస్టమర్ పై భారం పడకుండా రేటును నిర్ణయిస్తున్నామని తెలిపారు. రిటైల్ వ్యాపారులతో తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, వారికి వస్తున్న మార్జిన్ పై వివరించి చెబుతామని అన్నారు. మరోవైపు చికెన్ పై మార్జిన్ పెంచి, న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర రిటైల్ చికెన్ షాప్స్ అసోసియేషన్ చేస్తున్న బంద్ రెండో రోజుకు చేరుకుంది. ఏప్రిల్ 1 నుంచి బంద్ ప్రకటిస్తున్న రిటైల్ అసోసియేష్ సభ్యులు.. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్ పెంచేవరకూ నిరవధిక బంద్పాటిస్తామని హెచ్చరించింది. చికెన్ పై మార్జిన్ ఇవ్వకపోవడం పౌల్ట్రీ కంపెనీల తీరుకు నిరసనగా అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు రాజు, శ్రీనివాస్, గోపి, యాదగిరి, వేముల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇటీవల 26 శాతం ఉన్న మార్జిన్ ను పౌల్ట్రీ కంపెనీలు16 శాతానికి తగ్గించాయని, దీనివల్ల చికెన్ షాపుల నిర్వాహకులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

## ట్రాఫిక్ జంఝాటంపై పోలీసుల సర్వే

**వ్యక్తిగత వాహనాల వల్లనే రద్దీ**

**గ్రూప్ ప్రయాణాలతో రద్దీ తగ్గుతుందని వెల్లడి**

**హైదరాబాద్, ఏప్రిల్2 :** ఐటీ హబ్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని అరికట్టే వ్యూహంలో భాగంగా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆదేశాల మేరకు మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ పర్యవేక్షణలో సైబర్ టవర్స్ పరిసరాల్లో మార్నింగ్ పీక్ అవర్‌లో చేపట్టిన ఈ మాన్యువల్ సర్వేలో విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. కేవలం ఒక గంట వ్యవధిలోనే రోడ్డుకు నాలుగు వైపులా కలిపి 10,138 మంది సింగిల్ రైడర్లు (వాహనంలో ఒక్కరే ప్రయాణించేవారు) ప్రయాణించగా, డబుల్ రైడర్లు కేవలం 3,584 మంది మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. అంటే డబుల్ రైడర్ల కంటే సింగిల్ రైడర్లు 6,554 అధికంగా ఉండటం వల్ల రహదారులపై వాహనాల సంఖ్య అనూహ్యంగా పెరిగి తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లకు దారితీస్తోందని ఈ సర్వేలో స్పష్టమైంది. ఒక్కొక్కరు ఒక్కో వాహనంపై ప్రయాణించడం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరగడమే కాకుండా, వ్యక్తిగతంగా కూడా ప్రయాణికులు అనేక ఇబ్బందులకు లోనవుతున్నారని పోలీసులు పేర్కొన్నారు. ప్రయాణ సమయం వృథా కావడంతో పాటు అదనపు ఇంధన ఖర్చులు, ప్రమాదాల రిస్క్, శారీరక అలసట వంటి సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. దీనికి తోడు వాహనాల నుండి వెలువడే కార్బన్ ఉద్గారాల వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవన్నీ తెలిసినప్పటికీ, అధిక శాతం మంది ఒంటరిగా ప్రయాణించడానికే మొగ్గు చూపడం ఆశ్చర్యకరమని, ఈ ధోరణి

# రూ.84 ఆస్తితోనే ఎమ్మెల్యే రేస్‌లోకి...

❑ డబ్బుకాదు, ప్రజలే నా బలం" - యువతి సంచలన నిర్ణయం!

ఇల్లెందు ప్రతినిధి :(జన సంఘర్షణ)

అకౌంట్‌లో రూ.44... చేతిలో రూ.40... ప్రజా సమస్యలే పెట్టుబడిగా ఎన్నికల బరిలోకి దిగిన 26 ఏళ్ల ఆష్నా తంపి కథ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ రోజుల్లో రాజకీయాల్లోకి రావాలంటే కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సిందే అన్న అభిప్రాయం నెలకొన్న తరుణంలో, కేవలం రూ.84 ఆస్తితోనే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దిగిన కేరళ యువతి ఆష్నా తంపి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్ట్) పార్టీ తరఫున ఎట్టుమానూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆమె నామినేషన్ దాఖలు చేసింది. తన అఫిడవిట్‌లో వెల్లడించిన వివరాల ప్రకారం..ఆమె వద్ద రూ.40 నగదు, బ్యాంకు ఖాతాలో రూ.44 మాత్రమే ఉన్నాయి. ఇల్లు, స్థలం, వాహనం వంటి ఎలాంటి ఆస్తులు తన పేరుపై లేవని స్పష్టం చేసింది. కోట్ల ఆస్తులు ప్రకటించే అభ్యర్థుల మధ్య ఆమె నిరాడంబర జీవితం ప్రజల్లో చర్చకు దారితీసింది. లిటరేచర్‌లో డిగ్రీ, జర్నలిజంలో పీజీ డిప్లొమా పూర్తి చేసిన ఆష్నా తంపి, ఏఐడీఎస్ఓ ద్వారా సామాజిక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటోంది. ఆశా వర్కర్ల హక్కుల కోసం తన వెంట్రుకలు కట్‌చేసుకుని నిరసన తెలపడం ఆమె పోరాట స్ఫూర్తిని తెలియజేస్తుంది.



ప్రజలే ప్రచార బలం : భారీ ఖర్చులు లేకుండా, ప్రజల నుంచే వచ్చే చిన్నచిన్న విరాళాలతో ఆమె తన ప్రచారాన్ని కొనసాగిస్తోంది. రూ.10 నుండి రూ.50 వరకు అందుతున్న సహాయంతో పోస్టర్లు, పాంప్లెట్లు ముద్రిస్తూ ఇంటింటికీ తిరుగుతోంది.

ప్రజా సమస్యలే అజెండా : కోటయం మెడికల్ కాలేజీలో వైద్యుల కొరత, వరి రైతుల సమస్యలు, తాగునీటి ఇబ్బందులు వంటి స్థానిక సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని ఆమె చెబుతోంది. డబ్బు ఆధారంగా నడుస్తున్న రాజకీయాల్లో... "ప్రజలే అసలు శక్తి" అని నమ్ముతూ ముందుకు సాగుతున్న ఆష్నా తంపి నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# ఇల్లందులో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

❑ కౌన్సిలర్ సోనీ బాయ్ కోరి ఆధ్వర్యంలో భారీ అన్నదానం

ఇల్లందు ఏప్రిల్ 02 (జన సంఘర్షణ)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. ముఖ్యంగా 14, 15వ వార్డుల పరిధిలోని స్థానిక హనుమాన్ దేవాలయం వద్ద వార్డు కౌన్సిలర్ సోనీ బాయ్ కోరి ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం భక్తుల ప్రశంసలు అందుకుంది. 14వ వార్డు కౌన్సిలర్ నీరుడు ఉపేంద్రతో కలిసి సోనీ బాయ్ కోరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమాన్ని ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ దంపతులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సోనీ బాయ్ కోరి మాట్లాడుతూ.. స్వామివారి కృపతో వార్డు ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో తాము ఎప్పుడూ ముందుంటామని పేర్కొన్నారు. ఈ ఆధ్యాత్మిక ఉత్సవంలో హరిహర క్షేత్రం దేవాలయ కమిటీ చైర్మన్ గందె సదానందం, ఇల్లందు పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్ కోరి, 10వ వార్డు కౌన్సిలర్ మెరుగు కార్తిక యాదవ్, ఆదివాసి కమిటీ సంఘాల చైర్మన్ పెండేకట్ల యాకయ్య దొర, యూత్ కాంగ్రెస్ నాయకులు సుమిత్ కోరి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, స్థానిక వార్డుల ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవడంతో పాటు అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కౌన్సిలర్ సోనీ బాయ్ కోరి దగ్గరుండి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించడం గమనార్హం.



# నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి..

❑ ది పిడిఎస్‌యు డిమాండ్

నిజామాబాద్ . ఏప్రిల్ 02. (జ న సంఘర్షణ)

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి, జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్ యు. జిల్లా అధ్యక్షులు కర్క గణేష్, ప్రధాన కార్యదర్శి ఎల్.అనిల్ కుమార్ లు మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా చాలా వరకు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలు కళాశాలలు నడుస్తున్నాయన్నారు. సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్, ఒలంపియాడ్, టెక్, డీజీ లాంటి తోక పేర్లతో, ఐఐటి,నీట్, జేఈఈ లాంటివి ప్రోత్సహిస్తున్నామని మభ్యపెడుతూ, తల్లితండ్రులను విద్యార్థులను మోసం చేస్తున్నారని తెలిపారు. జి.ఓ.నంబర్ 01,100, విద్య హక్కు చట్టం ఎక్కడా కూడా అమలు కావడం లేదన్నారు. లక్షల రూపాయల ఫీజు తల్లితండ్రుల నుంచి ముక్కు పిండి వసూలు చేయడం దారుణమన్నారు. డిస్ట్రిక్ట్ ఫీ రెగ్యులేషన్ (డి ఎస్ ఆర్ సి) కమిటీ చైర్మన్గా ఉన్న జిల్లా కలెక్టర్ ఫీజులను ఎందుకు నియంత్రించట్లేదన్నారు. గుర్తింపు లేని పాఠశాలను మూసి వేయించాలని కోరారు. నిజామాబాద్ నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బ్రిలియంట్ హై స్కూల్, కారుణ్య హై స్కూల్, వీటితో పాటు కనీసం పాఠశాలలను సీజ్ చేయాలన్నారు. భవనానికి కూడా పర్మిషన్ లేకుండా ఆల్ఫోర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ , నారాయణ సీబీఎస్ఈ లాంటి వారు విచ్చలవిడిగా ప్రచారం చేస్తున్న మొక్కుబడిగా నోటీసులు మాత్రమే పంపించడం దుర్మార్గమన్నారు. వెంటనే యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. కొన్ని పాఠశాలలు ఒక పేరు మీద గుర్తింపు పొంది, మరొక పేరు మీద పాఠశాలలు నడుస్తున్నాయని తెలిపారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలు, కళాశాలల పూర్తి వివరాలు, వాటి ఫీజులను బహిర్గత పరిచి తల్లితండ్రులకు విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు. జిల్లా ఉపాధ్యక్షులు ఎండి.నజీర్, జీ. నితిన్, సహాయ కార్యదర్శి అల్గోట్ సృజన్, జిల్లా నాయకులు రేహాన్, మహేందర్, మున్నా అరవింద్, అయాన్ తదితరులు పాల్గొన్నారు.



# బయ్యారంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి వేడుకలు

ఇల్లందు . ఏప్రిల్ 2 :( జన సంఘర్షణ)

బయ్యారం: బహుజన వీరుడు, ప్రజాహిత పరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి సందర్భంగా బయ్యారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బయ్యారం ప్రాంతానికి చెందిన గౌడ కులస్తులు, పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి, కొబ్బరికాయలు కొట్టి ఘన నివాళులు అర్పించారు. ఆయన సామాజిక న్యాయం, బహుజన హక్కుల కోసం చేసిన పోరాటం గురించి పలువురు వక్తలు ప్రస్తావిస్తూ, నేటి తరానికి ఆయన జీవితం ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమాగాని సత్యం గౌడ్, బసవ్వ వెంకటేశ్వర్లు గౌడ్, బసవ్వ శ్రీను గౌడ్, కందాల వీరన్న గౌడ్, యరాసంగి వీరంకులు గౌడ్, కరెగుల శ్రీను గౌడ్, కత్తి రమేష్ రాజా గౌడ్, కత్తి రమేశ్ గౌడ్, కొత్త వినయ్ బాబు గౌడ్, గండు నరేష్ గౌడ్, గండు సురేష్ గౌడ్, నలమాస సతీష్ గౌడ్ తదితర యువకులు గౌడ సంఘ సభ్యులు పాల్గొన్నారు. చివరిగా, సమాజ అభ్యున్నతికి పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు.



# ఓటేసిన తర్వాత మేమే మరిచిపోయారా?

❑ కనిపించని కౌన్సిలర్‌పై మండిపడ్డ ప్రజలు... గ్రామసభ బహిష్కరణ!

ఇల్లెందు: ప్రతినిధి ఏప్రిల్. 2 (జన సంఘర్షణ)

ఇల్లెందు పట్టణంలో నిర్వహించిన గ్రామసభ తీవ్ర విమర్శల నడుమ ఉద్రిక్తంగా మారింది. 23వ వార్డు ప్రజలు కౌన్సిలర్ పనితీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామసభను బహిష్కరించారు. వార్డు కౌన్సిలర్‌గా గెలిచిన కొండపల్లి సరిత ఎన్నికల తర్వాత ప్రజలకు అందుబాటులో లేకపోవడం వల్ల, వార్డులో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక సమస్యలు కుప్పలుగా పేరుకుపోయాయని ప్రజలు తీవ్రంగా విమర్శించారు. "ఓట్లు వేసినప్పుడు మాత్రమే గుర్తొస్తామా? తర్వాత మా పరిస్థితి ఎవరికి పట్టదు?" అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేకసార్లు సమస్యలు తెలియజేయడానికి ప్రయత్నించినా స్పందన లేకపోవడంతో, తమ పరిస్థితి దయనీయంగా మారిందని వాపోయారు. ఈ నేపథ్యంలో గ్రామసభకు కౌన్సిలర్ హాజరుకావడాన్ని ప్రజలు వ్యంగ్యంగా ప్రశ్నిస్తూ "ఇప్పుడే ఎందుకు వచ్చారు?" అంటూ నిలదీశారు. తమ సమస్యలకు పరిష్కారం చూపని ప్రజాప్రతినిధులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన వార్డు ప్రజలు, చివరకు గ్రామసభను బహిష్కరించి నిరసన తెలపడం గమనార్హం. ఈ ఘటన స్థానికంగా పెద్ద చర్చకు దారితీసింది.



# యాడారంలో పశువులకు గాలికుంటు టీకాలు

బిబిపేట్,ఏప్రిల్ 2. ( జన సంఘర్షణ )

కామారెడ్డి జిల్లా, బీబీపేట మండలం యాడారం లోపాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఆరు నెలలకు ఒకసారి ఈ టీకాలు వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని పశువులకు టీకాలు వేశారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్ గొబ్బూరి సుధారాణి, ఉప సర్పంచ్ సుద్దాల రాజు, వార్డ్ మేంబర్ గొబ్బూరి రాజిరెడ్డి, పాల కేంద్రం సొసైటి చైర్మన్ పిడుగు స్వామి మండల పశువైద్య అధికారి హేమశ్రీ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# గ్రామ సభలో వెల్లువెత్తిన సమస్యలు...

❑ "అన్ని పరిష్కారం చేస్తాం" అంటూ సర్పంచ్ హామీ!

ఖమ్మం సింగరేణి ప్రతినిధి :(జన సంఘర్షణ )

గుంపెళ్ళ గూడెం గ్రామపంచాయతి: గుంపెళ్ళ గూడెం గ్రామపంచాయతీలో ప్రజా పాలన– ప్రజాప్రణాళిక కార్యక్రమం సజావుగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ గూగులోత్ కృష్ణవేణి, ఉప సర్పంచ్ భూక్యా శంకర్, గ్రామ సెక్రటరీ, వార్డు సభ్యులు హాజరై గ్రామాభివృద్ధిపై చర్చించారు. గ్రామ సభలో గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ గ్రామంలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై గ్రామస్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గూగులోత్ కృష్ణవేణి మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు సూచించిన ప్రతి సమస్యను ప్రాధాన్యతతో పరిగణలోకి తీసుకొని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమని తెలిపారు. గ్రామ సభలో ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడటం ద్వారా సమస్యలను అర్థం చేసుకుని పరిష్కార మార్గాలు రూపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. చివరగా, గ్రామాభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.




# 23వ వార్డులో గ్రామసభ బహిష్కరణ

❑ వార్డు కౌన్సిలర్ తీరుపై నిరసన

ఇల్లందు ఏప్రిల్02 . (జన సంఘర్షణ)

మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో స్థానిక ప్రజలు గ్రామసభను బహిష్కరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. వార్డు కౌన్సిలర్ కొండపల్లి సరిత గెలిచినప్పటి నుండి వార్డు సమస్యలను పట్టించుకోవడంలో విఫలమయ్యారని, కనీసం అందుబాటులో కూడా ఉండటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నిర్వహించిన గ్రామసభకు సైతం కౌన్సిలర్ గైర్హాజరు కావడంతో తీవ్ర అసహనానికి గురైన ప్రజలు.. సభను మధ్యలోనే విడిచిపెట్టారు. అధికార పార్టీ అభ్యర్థిగా గెలిపించినా అభివృద్ధి శూన్యమని, ఇకనైనా తమ సమస్యలను పరిష్కరించాలని రాజారాం, రామకృష్ణ తదితర స్థానికులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



# తుజాల్ పూర్‌లో హనుమాన్ జయంతి ఉత్సవాలు

బీబీపెట్, ఏప్రిల్ 02 ( జన సంఘర్షణ)

కామారెడ్డి జిల్లా, బీబీపేట మండలం, తూజల్ పూర్‌లో హైందవ సేన కమిటీ నుండి గ్రామంలో హనుమాన్ మొదటి విజయోత్సవ కార్యక్రమంలో శివరామ మందిరాలయంలో నేడు హనుమాన్ విగ్రహానికి చందనం పెట్టడం జరిగింది. అలాగే బైక్ ర్యాలీ చేయడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తలారి పవిత్ర , ఉప సర్పంచ్ లక్ష్మణ్ రెడ్డి,అలాగే పాలకవర్గం సభ్యులు, హైందవసేవ సభ్యులు, గ్రామ ప్రజలు, అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక



# గ్రామ సభకు గైర్హాజరు ఇందిరమ్మ కమిటీ

- గుంపెళ్ళగూడెం గ్రామంలో ఉద్రిక్తత... ఆగ్రహంతో ఉవ్వెత్తున ఎగిసిన ప్రజలు!

ఖమ్మం సింగరేణి ప్రతినిధి( జన సంఘర్షణ )

గుంపెళ్ళగూడెం, గ్రామాభివృద్ధికి కీలకమైన గ్రామ సభలో ఇందిరమ్మ కమిటీ గైర్హాజరు కావడం గుంపెళ్ళగూడెం గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామ ప్రజలందరూ భారీగా హాజరైన ఈ సభలో, ఇతర కమిటీ సభ్యులు అందరూ హాజరై చర్చల్లో పాల్గొనగా, అత్యంత ప్రాధాన్యత కలిగిన ఇందిరమ్మ కమిటీ మాత్రం హాజరు కాకపోవడం ప్రజల్లో ఆగ్రహాన్ని రగిలించింది. "ఇతర కమిటీలు వస్తే, ఇందిరమ్మ కమిటీ ఎందుకు రాలేదు?" అనే ప్రశ్నతో గ్రామస్తులు మండిపడ్డారు. గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించాల్సిన సమయంలో కమిటీ గైర్హాజరు కావడం ప్రజలలో అనుమానాలు, అసంతృప్తిని పెంచింది. ఈ ఘటనతో గ్రామ సభ వేడెక్కి, కొంతసేపు ఘర్షణాత్మక వాతావరణం నెలకొంది. ప్రజలు గట్టిగా నినాదాలు చేస్తూ, అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రామ ప్రజలు మాట్లాడుతూ.."గ్రామ సమస్యలు చెప్పుకోవడానికి ఏర్పాటు చేసిన సభకు సంబంధిత కమిటీ రాకపోతే ప్రజలు ఎవరిని నమ్మాలి?" అని ప్రశ్నించారు. ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్తులో మరింత తీవ్రమైన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ ఘటనపై సంబంధిత



అధికారులు తక్షణమే స్పందించి, ఇందిరమ్మ కమిటీ గైర్హాజరు కారణాలను వెల్లడించాలని, అలాగే గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు.

# అందరి భాగస్వామ్యంతోనే సత్వర ప్రగతి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపు
- అట్టహాసంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వార్డు సభలు

నిజామాబాద్, ఏప్రిల్ 02 ( జన సంఘర్షణ)

పల్లెలు, పట్టణాల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలలో అన్ని వర్గాల వారు భాగస్వాములు కావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే సత్వర ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం బోధన్ పట్టణంలోని 26, 35వ వార్డులలో నిర్వహించిన వార్డు సభలలో కలెక్టర్ పాల్గొన్నారు. జయ జయహే తెలంగాణ రాష్ట్ర గేయంతో సభలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. తమ సమస్యలను ప్రజలు రాతపూర్వకంగా తెలియజేసేందుకు వీలుగా వార్డు సభ వేదికల వద్ద ఫిర్యాదుల బాక్సులను అందుబాటులో ఉంచారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారుల వివరాలను ఒక్కో పథకం వారీగా పేరుపేరున ప్రకటించారు ఇందిరమ్మ ఇళ్ల పథకం, గృహ జ్యోతి, చేయూత పథకం, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ తదితర వాటి ద్వారా లబ్ది పొందిన వారి వివరాలు చదివి వినిపించారు. పలువురు లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల తమకు చేకూరిన ప్రయోజనాల గురించి వార్డు సభలలో తమ అనుభవాలను తెలియజేస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మునుముందు అమలు చేయనున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ, రాష్ట్ర ప్రగతి, సంక్షేమంలో వారిని భాగస్వామ్యం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని అన్నారు. పట్టణ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన



పనులకు సంబంధించి అందరి అభిప్రాయాలను క్రోడీకరించి సమగ్ర ప్రణాళిక రూపొందించడానికి, సమస్యల పరిష్కారానికి ఈ సభలు దోహదపడతాయని తెలిపారు.

ప్రభుత్వం రైతు భరోసా పథకం, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500/-కి గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్), కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్, చేయూత పథకం కింద పెన్షన్ లు వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయడం జరుగుతోందని అన్నారు. ఎక్కడైనా అవకతవకలు జరిగితే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తేవాలని సూచించారు. అక్రమాలకు ఆస్కారం కల్పించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇంకనూ అర్హులైన వారు మిగిలి ఉంటే, ఆయా పథకాల ద్వారా లబ్ది చేకూర్చడం జరుగుతుందని భరోసా కల్పించారు. ముఖ్యంగా తొలివిడత ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు తుది దశకు చేరాయని, త్వరలోనే ప్రభుత్వం రెండవ విడత కింద లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయనుందని అన్నారు. గుడిసెలు లేని తెలంగాణగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా గుడిసెలలో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరీలో మొదటి ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, అంగన్వాడీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహార పథకం, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనుందని వివరించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరేలా అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు. కాగా, 26వ వార్డులో రేఖమ్మ అనే మహిళ భర్త ఇటీవలే మృతి చెందగా, ఆమెకు రెండు పడక గదుల ఇల్లు మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలని, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, చెత్త సేకరణ కోసం ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ వాహనాల సిబ్బందికి తడి-పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా వార్డుల అభివృద్ధిపై స్థానికుల నుండి అభిప్రాయాలు సేకరించారు. వార్డు సభలలో బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి, కమిషనర్ జాదవ్ కృష్ణ, కార్పోరేటర్ దామోదర్, ఏసీపీ శ్రీనివాస్, ట్రాన్కో ఏడీఈ ముఖ్తార్, వివిధ శాఖల అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల ముంగిటకే మున్సిపల్ పాలన

- ఇల్లందు చైర్‌పర్సన్ కిరణ్ మిత్ర డానియల్ అద్భుత చొరవ

ఇల్లందు ఏప్రిల్ 02 (జన సంఘర్షణ)




ఇల్లందు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ సారథ్యంలో 'ప్రజా పాలన' కార్యక్రమం నూతన ఉత్సాహంతో దూసుకుపోతోంది. 2వ వార్డు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నిర్వహించిన గ్రామ సభలో ఆమె స్వయంగా పాల్గొని ప్రజల సమస్యలను నేరుగా ఆలకించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మార్గదర్శకత్వంలో ఇల్లందు పట్టణ రూపురేఖలను మార్చడమే తన లక్ష్యమని స్పష్టం చేస్తూ, తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనలో రాజీ పడే ప్రసక్తే లేదని కిరణ్ మిత్ర తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రతి నిరుపేద కుటుంబానికి చేరవేయడమే తన ప్రథమ కర్తవ్యమని, సమస్య ఏదైనా తక్షణమే పరిష్కరించేలా యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్న తీరుపై స్థానిక ప్రజల నుంచి విశేష ప్రశంసలు అందుతున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గణేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దొడ్డ డానియల్ పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# వార్డు సమస్యల పరిష్కారమే నా ప్రథమ కర్తవ్యం

- 'ప్రజా పాలన'తో సమస్యలకు సత్వర పరిష్కారం
- ఇల్లందు 21వ వార్డు కౌన్సిలర్ నీలపు రమేష్

ఇల్లందు ఏప్రిల్ 02 (జన సంఘర్షణ)



ఇల్లందు 21వ వార్డు అభివృద్ధిని కాం క్షిస్తూ కౌన్సిలర్ నీలపు రమేష్ చేపట్టిన 'ప్రజా పాలన' కార్యక్రమం వార్డు ప్రజల నుంచి విశేష స్పందన పొందింది. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా రమేష్ స్పష్టం చేశారు. పారిశుద్ధ్య లోపాలను అరికట్టడం, పెండింగ్‌లో ఉన్న సివిల్ సమస్యలను తీర్చడంతో పాటు కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, మహిళా సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ చేరవేసేలా తాను నిరంతరం పర్యవేక్షిస్తానని ఆయన హామీ ఇచ్చారు. వార్డు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, సురక్షిత రోడ్లు అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు రాఘవ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# పెద్దమల్లారెడ్డిలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

భిక్కనూర్, ఏప్రిల్ 2 ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా, భిక్కనుర్ మండలం పెద్దామల్లారెడ్డి గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఘనంగా హనుమాన్ శోభ యాత్ర చేయడం జరిగింది. తర్వాత అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వాములు, గ్రామ ప్రజలు, వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విజయలక్ష్మి నగర్‌లో ఘనంగా 'జల మహోత్సవం'

- ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరే ప్రభుత్వ లక్ష్యం

ఇల్లందు. ఏప్రిల్ 02 . (జన సంఘర్షణ )




విజయలక్ష్మి నగర్ గ్రామ పంచాయతీలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో 'జలజీవన్ మిషన్ - హర్ ఘర్ జల్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జల మహోత్సవం వేడుకలను స్థానిక సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ, ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన మంచినీటిని అందిస్తోందని, నిత్యం ట్యాంకుల శుద్ధి, నీటి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తూ ఇంటింటికీ సురక్షిత జలాలు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు వాటర్ ట్యాంక్ నుండి భారీ ర్యాలీ నిర్వహించడంతో పాటు, బోరు, భగీరథ నీటిపై క్షేత్రస్థాయిలో నాణ్యత పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు బాలాజీ, చంద్రశేఖర్, పంచాయతీ సెక్రెటరీ రజనీకాంత్, ఉపసర్పంచ్ రేణుక, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ దండు సారయ్య దూకుడు

- వార్డుల సమగ్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి
- ప్రగతి ప్రణాళిక సభలో అధికారులకు దిశానిర్దేశం

ఇల్లందు ఏప్రిల్ 02 . (జన సంఘర్షణ)



మున్సిపాలిటీ పరిధిలో జరిగిన 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' గ్రామ సభల్లో 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ప్రజా పక్షపాతిగా నిలిచి అధికారుల ముందు సమస్యల చిట్టాను విప్పారు. వార్డు అభివృద్ధి విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన ఆయన, ప్రజల నుండి వచ్చిన ప్రతి విన్నపాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేశారు. ముఖ్యంగా అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందడంలో జాప్యం జరగకూడదని, పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్ల వంటి మౌలిక సదుపాయాల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆయన అధికారులకు గట్టిగా సూచించారు. ప్రజా సమస్యల పట్ల సారయ్య చూపుతున్న నిరంతర పర్యవేక్షణ, చిత్తశుద్ధిని చూసి స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుండగా, ఇతర వార్డు కౌన్సిలర్లు సైతం ఆయన పనితీరును అభినందించారు. ఒక కౌన్సిలర్‌గా అందరినీ సమన్వయం చేస్తూ, వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా దండు సారయ్య పునరుద్ఘాటించారు.

# "భద్రతపై ఫోకస్..గ్రామంలో 5 సోలార్ సీసీ కెమెరాల ఏర్పాటు!"


ఇల్లందు ప్రతినిధి :(జన సంఘర్షణ)



బయ్యారం మండలం వెంకట్రాంపురం గ్రామ పరిధిలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగు పడింది. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శభరీష్. పి సూచనల మేరకు గ్రామంలో ఐదు సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని వెంకట్రాంపురం సర్పంచ్ దారావత్ శివాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో నేరాల నివారణ, ప్రజల భద్రతను పెంపొం దించడం లక్ష్యంగా ఈ కెమెరాలను ముఖ్య ప్రాంతాల్లో అమర్చారు. సోలార్ విధానంలో పనిచేసే ఈ సీసీ కెమెరాలు విద్యుత్ అంతరాయం ఉన్నప్పటికీ నిరంతర పర్యవేక్షణను అందించగలవని అధికారులు తెలిపారు. గ్రామ ప్రజలు ఈ చర్యపై సంతోషం వ్యక్తం చేస్తూ, భద్రతా పరంగా ఇది ఎంతో ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యలతో గ్రామాల్లో నేరాలను అరికట్టడంతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెరుగుతుందని అధికారులు వెల్లడించారు.

## గ్రామసభలో ఆత్మహత్యాయత్నం

భిక్నూర్, ఏప్రిల్ 02 ( జన సంఘర్షణ )
కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం కంచర్ల గ్రామసభ ప్రాంగణంలో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాలు.. గొల్ల రాములు అనే వ్యక్తి గతంలో పొందిన పెన్షన్ ప్రస్తుతం నిలిచిపోయిందని, పలుమార్లు దరఖాస్తు చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తూ చెట్టెక్కి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే స్పందించిన గ్రామ పాలకవర్గ సభ్యులు అతడిని కాపాడారు. పెన్షన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.



## హెచ్పీవీ వ్యాక్సినేషన్ ప్రక్రియ ప్రారంభం



బిబీపేట, ఏప్రిల్ 2 ( జన సంఘర్షణ )
కామారెడ్డి జిల్లా, బీబీపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్పీవీ వ్యాక్సినేషన్ ప్రక్రియను బుధవారం సర్పంచ్ సాధ్విక సాయినాథ్ ప్రారంభించారు. గర్భాశయ క్యాన్సర్ నిరోధకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని 14 ఏళ్ల బాలికలకు టీకాలు అందించడం గొప్ప విషయమని ఆమె కొనియాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు టీకాలు వేయించాలని, సిబ్బంది సైతం అవగాహన కల్పించాలని కోరారు. యం.ఓ డా. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## 99 రోజుల ప్రణాళికతో గ్రామాభివృద్ధికి వేగం...



◆ సంక్షేమంతో ప్రజలకు నూతన ఆశలు!"

ఖమ్మం సింగరేణి ప్రతినిధి (జన సంఘర్షణ )
తెలంగాణ రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి సాధనతో పాటు ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ ఫలాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భాగ్యనగర్ తండా సర్పంచ్ హీరాలాల్ తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల ప్రత్యేక ప్రణాళికలు కీలకంగా మారాయని ఆయన స్పష్టం చేశారు. భాగ్యనగర్ తండాలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతూ..ఈ ప్రణాళికల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతమవుతున్నాయని అన్నారు. కొత్తగా ఏర్పడిన పాలకవర్గాలకు ఇవి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామస్థుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, వాటికి తక్షణ పరిష్కారాలు కనుగొనడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. సంక్షేమ పథకాల అమలుతో గ్రామ ప్రజల జీవన స్థితి మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఐకేపీ ఏపీఎం, పంచాయతీ కార్యదర్శి, వివిధ శాఖల అధికారులు, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గండిమాసానిపేట్ లో రసవత్తరగా సాగిన కుస్తీ పోటీలు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ -2( జన సంఘర్షణ )



హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు గండిమాసానిపేట్ హనుమాన్ మందిరం వద్ద గ్రామస్తులబ ఆధర్యంలో నిర్వహించే కుస్తీ పోటీలకు భారీగా జన సందోహం కనిపించింది. కుస్తీ పోటీలు తిలకించేందుకు మూడు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ నుండి మల్ల యోధులు వారి మద్దతుదారులు, మండలంలోని పలు గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. టెంకాయ నుంచి మొదలైన కుస్తీ పోటీలు చివరి కుస్తీ గెలుపొందిన వారికి వెండి కడియం బహుకరించారు. ఈ సందర్భంగా హనుమాన్ మందిరం వద్ద గ్రామస్తుల ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. పలు రాష్ట్రాల నుండి మండలంలోని గ్రామాల నుండి వచ్చిన భక్తులకు మహా అన్నప్రసాదం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రావణ్ కుమార్, వహాబ్, బబ్లు,జగన్ గౌడ్ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్ట్ అనేది సైబర్ నేరగాళ్లు పన్నిన వల..

◆ అసలు డిజిటల్ అరెస్ట్ అనేది ఉండదు..
◆ ఏ పోలీసు అధికారి నేరుగా వీడియో కాల్స్ చేయరు..
◆ వీడియో కాల్స్ చేసి, పోలీసులం అంటే నమ్మకండి..
◆ సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలంటే వాటి మీద అవగాహన ముఖ్యం..
◆ జిల్లా కేంద్రంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన ఇన్స్పెక్టర్ ముఖీడ్ పాషా సిసి, పిఎస్ సిబ్బంది

బోధన్ : ఏప్రిల్ 2 జన సంఘర్షణ
గురువారం జిల్లా కేంద్రంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల లో విద్యార్థులకు, అధ్యాపకులకు సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్స్పెక్టర్ ఇన్స్పెక్టర్ ముఖీడ్ పాషా. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలు అనేవి ఈ రోజుల్లో ప్రతి ఒక్కరు ఎదురుకుంటున్న సమస్య అని, సైబర్ నేరాల నుండి బయటపడాలంటే అవగాహన ముఖ్యం అన్నారు. అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల పన్నిన వలలో పడవద్దన్నారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, వంటి ఆన్లైన్ మోసాల పట్ల అవగాహ కలిగి ఉండాలని, మొదట డబ్బులు వస్తున్నట్లు ఆశ చూపించి, ఆతర్వాత ఆన్లైన్ మోసాలకు పాల్పడతారని గుర్తించాలన్నారు. తప్పుడు మార్గంలో డబ్బులు సంపాదించడానికి నేరస్తులు ఎంచుకున్న మార్గం సైబర్ నేరాలు, అమాయక ప్రజలే సైబర్ నేరగాళ్ల టార్గెట్ చేస్తూ, తక్కువ డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే ఎక్కువడబ్బులు వస్తాయని మొదట నమ్మికం కలిగించి, తరువాత ఆన్లైన్ మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. తెలియని ఫోన్ నెంబర్ ల నుండి వీడియో కాల్స్ చేస్తూ.. పోలీసు అధికారులం అని మీరు క్రైమ్ లో ఇన్వాల్వ్ అయ్యారని, లేదంటే మీ అకౌంటు బ్లాక్ చేస్తామని బెదిరిస్తూ.. ఓటీపీ, పాస్వర్డ్ చెప్పాలని ఓటీడీకి గురి చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఆర్.టి.ఎ. చలాన స్కామ్స్..




మీ వాహనంపై ఆర్.టి.ఎ. ఈ -చలాన ఉందని, దానిని క్లియర్ చేయడానికి ఏపీకే ఓపెన్ ఫైల్ చేయాలని సూచిస్తారని, ఏపీకే ఫైల్ ఓపెన్ చేసిన వెంటనే మన ఫోన్ లో ఉన్న విలువైన సమాచారం సైబర్ మోసాగాళ్ల చేతిలోకి వెళ్లిపోతుందని, తద్వారా ఆన్లైన్ మోసాలకు పాల్పడతారని అన్నారు. ఫేక్ ప్రొఫైల్ ఫేక్ స్కామ్స్.. ఫేక్ ప్రొఫైల్ తో పోలీసు అధికారులం అని, కస్టమ్స్ అధికారులం అని గుర్తు తెలియని ఫోన్ నెంబర్ల నుండి, కాల్స్, వీడియో కాల్స్ వస్తే నమ్మరాదని, ఏ పోలీసు అధికారి ఎంక్వైరీ పేరుతో నేరుగా వాట్స్ ఆప్ వీడియో కాల్స్ చేయరాని, డిజిటల్ అరెస్ట్ అని కాల్స్ వస్తే నమ్మరాదని అన్నారు. అనుమానిత ఫోన్ నెంబర్ల నుండి కాల్స్ వస్తే సంబంధిత పోలీసు స్టేషన్ లో సమాచారం అందించాలని లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ నందు రిపోర్ట్ చేయాలని సూచించారు.

కస్టమర్ సర్వీస్ స్కామ్స్ (ఆన్లైన్ బుకింగ్స్).. ఆన్లైన్ షాపింగ్లో భాగంగా వివిధ రకాల సైట్లలో కస్టమర్ కేర్ నెంబర్ల కోసం సర్చ్ చేసిన వెంటనే సైబర్ మోసగాళ్ళు గుర్తించి, తప్పుడు ఫోన్ నెంబర్ల నుండి కాల్స్ చేసి ఆన్లైన్ లో ఎంక్వయిరీ చేశారని మోసగించి సైబర్ నేరాలకు పాల్పడతారని, అమాయక ప్రజల బాలహీనతే, సైబర్ నేరాగాళ్ల బలంగా.. వివిధ రకాల సైబర్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్సీ అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో టెక్నాలజీని వాడుకొని మరిన్ని సైబర్ మోసాలు చేయడానికి అవకాశం ఉందని, సైబర్ నేరాల గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉన్నప్పుడే సైబర్ నేరాల నుండి బయటపడవచ్చని అన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురి అయినట్లైతే వెంటనే (గోల్డెన్ అవర్)/48 గంటలలోపు 1930 కు కాల్ చేసి గాని, యన్.సి.ఆర్.బి. (హెచ్టీపీపీఎస్:/డబ్లుడబ్లుడబ్లు.సైబర్క్రైమ్.జీవోవి.ఇన్) పోర్టల్ నందు కాంప్లయింట్ నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ , కళాశాల లెక్చరర్ లు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్సై లు ప్రవళిక , రవి కుమార్, సైబర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు సబ్ జైలులో ఖైదీలకు వైద్య పరీక్షలు

◆ మానసిక ప్రశాంతతే ఆరోగ్య రహస్యం
◆ జైలు సూపరింటెండెంట్ చంద్రశేఖర్



ఇల్లందు ఏప్రిల్ 02 (జన సంఘర్షణ)
ఖైదీల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఇల్లందు సబ్ జైలులో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా భారీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జైలు సూపరింటెండెంట్ చంద్రశేఖర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఖైదీలతో పాటు జైలు సిబ్బందికి కూడా క్షుణ్ణంగా ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ హర్షవర్ధన్, డాక్టర్ తేజశ్రీల పర్యవేక్షణలో ఖైదీలకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలపై తగిన వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. జైలులో ఉన్న ఖైదీలు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలన్నదే తమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వైద్యులు మాట్లాడుతూ ఖైదీలు గతాన్ని విస్మరించి, మానవతా విలువలతో కూడిన నూతన జీవితం వైపు పయనించాలని, అందుకు మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ భుజంగ రాజు, భాస్కర్ రావు, వైద్య బృందం పాల్గొని ఖైదీల ఆరోగ్య స్థితిగతులను సమీక్షించారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

బోధన్, ఏప్రిల్ 02 (జన సంఘర్షణ )



బోధన్ పట్టణంలోని విద్యా వికాస్ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం తనిఖీ చేశారు. ఆయా తరగతి గదులను సందర్శించి పరీక్షల నిర్వహణ సరళిని పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందితో ఎవరైనా సెల్ ఫోన్లు తెచ్చారా అని ఆరా తీశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరు కూడా పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు తేకూడదని, కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని నిర్వాహకులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, ప్రథమ చికిత్స, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. తరగతి గదిలో తగిన వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి చిన్న తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా, కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీ.సీ కెమెరా రికార్డింగ్ నడుమ ప్రశ్న పత్రాల సీళ్లు తెరిచారా లేదా అని తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మంగళ ఉన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ

◆ పథకాల అమలు గురించి అభిప్రాయాలూ అడిగి తెలుసుకొన్నారు.

బోధన్ : ఏప్రిల్ 02 జన సంఘర్షణ
ప్రణాళికలో భాగంగా గురువారం రోజున ఉదయం బోధన్ పట్టణంలోని 38 వార్డులలో వార్డు సభలు నిర్వహించారు. 35వ వార్డు, 26 వ వార్డులో నిర్వహించిన వార్డు సభలలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. వార్డు ప్రజలతో ప్రభుత్వ పథకాల అమలు గురించి అభిప్రాయాలూ అడిగి తెలుసుకొన్నారు. అలాగే 35 వార్డులో మున్సిపల్ చైర్పర్సన్ పద్మ శరత్ రెడ్డి అధ్యక్షతన వార్డు సభ ఏర్పాటు చేశారు. చైర్ పర్సన్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాల మూడు నెలల కాలంలో చేపట్టిన అమలు చేసినటువంటి సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు తెలిపారు.ప్రజా పాలనలో ప్రజల భాగస్వామ్యం పెంచడం కోసం ప్రభుత్వం అమలు చేసినటువంటి పథకాల పైన చర్చ, లబ్ధిదారుల అభిప్రాయాల సేకరణ చేయడం జరిగింది. ఇంకా భవిష్యత్తులో వార్డు అభివృద్ధి కొరకు వార్డు ప్రజల అవసరాల కోసం ప్రణాళికలు తయారు చేయడం పైన నిర్ణయాలు తీసుకోవటంపై చర్చ చేయడం జరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రూ.500 రూపాయలకే సిలిండర్, చేయూత పెన్షన్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు, కొత్త రేషన్ కార్డుల మంజూరు వీటి ద్వారా లబ్ధి పొందిన వారితో వారి అభిప్రాయాలు తెలుసుకోవడం జరిగింది. ప్రభుత్వం అమలు చేయబోతు న్నటువంటి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజన పథకం, అల్పాహార పథకం, దివ్యాంగ విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటర్ వాహనాల పంపిణీ వీటి గురించి తెలియజేశారు. అలాగే వార్డులో ఉన్నటువంటి సమస్యలను తెలుసుకొని, సమస్యల ప్రాధాన్యత ప్రకారం చేసుకొని వాటిని పరిష్కరించడానికి నిర్ణయాలు తీసుకోవడానికి తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ ,అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ బోధన్ సర్కిల్ ఇన్స్పెక్టర్, వార్డు ఆఫీసర్లు వార్డులోని ప్రజలు పాల్గొన్నారు. పట్టణంలోని అన్ని వార్డులలో వార్డు కౌన్సిలర్ ల అధ్యక్షతన వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో ప్రజల భాగస్వామ్యం తో వార్డు సభలు నిర్వహించారు.




## లక్ష్మాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ -2(జన సంఘర్షణ ):
ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో గురువారం స్థానిక సర్పంచ్ మంజుల సాయిలు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ సిబ్బందితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి చేస్తోందని, పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల సాయిలు, సొసైటీ సీఈఓ విశ్వనాథం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగేష్, సొసైటీ డైరెక్టర్ సాయిలు, వార్డు సభ్యులు, రైతులు తదితరులున్నారు.



# జై శ్రీరామ్..అడుగు..అడుగునా..రామనామం..పులకించిన భాగ్యనగరం...



హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 2(జనసంఘర్షణ )
కాషాయం జెండా.. రెప రెప్పలాడుతూ హైదరాబాద్ విశ్వనగరం పులకించిపోయింది.. గురువారం అనుమాన్ జయంతి సందర్భంగా గౌలిగూడ కమాన్ నుండి తాడ్ బండ్ ఆంజనేయ స్వామి గుడివరకు జై అనుమాన్ జైత్ర యాత్రను నిర్వహించారు. భారీ బందోబస్తుతో సుమారుగా ముడువేయిల మంది పోలీసులతో నిగా నీడలో అనుమాన్ యాత్రను నిర్వహించారు. హిందూ ఐక్యతను చాటే విధంగా భారీ యెత్తున తరలి వచ్చిన శ్రీ హనుమాన్ విజయోత్సవ శోభా యాత్రకు ముషీరాబాద్ నియోజకవర్గం, గాంధీనగర్ డివిజన్ బి జె వై ఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదిక నుండి ఘనంగా స్వాగతం పలికారు. వేదికపై ముఖ్య అతిథులుగా గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్, బిజెపి ఓబీసీ మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బిజెవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ, బిజెపి, బి జె వై ఎం నాయకులు, కార్యకర్తలు వేదికపై నుండి శోభాయాత్ర పై పూలు చల్లి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బిజెవైఎం నాయకులు అరుణ్ కుమార్, జ్ఞానేశ్వర్,సాయి తరుణ్, భాను, సాయి తేజ, క్రాంతి, వరుణ్, చింటు, బిజెపీ నేతలు రత్న సాయి చంద్, శ్రీకాంత్, సత్తి రెడ్డి, ప్రకాష్ యాదవ్, మదన్మోహన్, ఆనంద్ రావు, సాయికుమార్, లక్ష్మి,పూర్ణ, అనుష, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారులకు చేకూరాలి

◆ మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్



ఎల్లారెడ్డి, ఏప్రిల్ -2 (జన సంఘర్షణ )
ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారులకు చేకూరాలి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ రెండో వార్డులోని బీసీ కాలనీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా హాజయ్యారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నిర్వహించిన ఈ సభలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్న రకం వడ్ల కొనుగోలు, పెన్షన్లు, గృహజ్యోతి, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, కొత్త రేషన్ కార్డులు తదితర పథకాలపై విస్తృతంగా చర్చించారు. అలాగే స్థానిక వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతమైన బీసీ కాలనీలో చేపట్టవలసిన ముందస్తు చర్యలపై కాలనీ వాసులతో చర్చించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకాలు చేరేలా కృషి చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, కమిషనర్ మహేష్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని, రాబోయే కాలంలో ఆరోగ్యం, పరిశుభ్రత, విద్య, ఉపాధి అవకాశాలు, క్రీడల ప్రోత్సాహం, మహిళా మరియు శిశు సంక్షేమం, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి దిశగా "క్యూర్, ప్యూర్, రేర్" భావనతో ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, వార్డు కౌన్సిలర్ మంచిర్యాల మహేశ్వరి విద్యాసాగర్, కమిషనర్ మహేష్, ఎంఈఓ, వార్డు ఆఫీసర్ అవినాష్, విద్యుత్ ఏఈ, లైన్ మెన్, ఆర్పి రేఖ, అంగన్వాడి టీచర్ ముస్రత్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో వార్డు ప్రజలు హాజరయ్యారు.

# దౌలతాబాద్‌లో గ్రామ సభ


◆ అభివృద్ధి అంశాలపై విస్తృత చర్చ




తానురు,ఏప్రిల్ 2 (జన సంఘర్షణ)
తానురు మండలంలోని దౌలతాబాద్ గ్రామంలో గ్రామ సభను శుక్రవారం నిర్వహించారు. ఈ గ్రామ సభలో గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, తాగునీటి సమస్యలు, రహదారుల మరమ్మత్తులు, పరిశుభ్రత వంటి అంశాలపై చర్చించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్లు, విద్యుత్తు సమస్యలపై చర్చించారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, సంబంధిత అధికారులు వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో ప్రత్యక అధికారీ ప్రణయ్, సర్పంచ్ అనిత, ఉప సర్పంచ్ పవన్, కార్యదర్శి లక్ష్మణ్, వార్డు సభ్యులు గ్రామ పెద్దలు, మహిళలు మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో చలివేంద్రం ప్రారంభించారు. గ్రామ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సభలో నిర్ణయించారు.

# బొంద్రాట్ గ్రామంలో సప్తహ కార్యక్రమంలో పాల్గొన్న భోస్లే నారాయణ రావు పాటిల్

భైంసా, ఏప్రిల్ 02 (జనసంఘర్షణ)



ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్, మాజీ శాసన సభ్యులు భోస్లే నారాయణ రావు పాటిల్ బొంద్రాట్ గ్రామంలో నిర్వహించిన సప్తహ, బండార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని, గ్రామ ప్రజలతో కలసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేశవ్, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ఎంపీపీ భోజారం పటేల్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్ర, మాజీ సొసైటీ చైర్మన్ శ్యామ్ రావు పటేల్, దేవీదాస్ మధు పటేల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరితంగా జరిగింది.

# హనుమాన్ ఆలయానికి మైక్ సెట్ వితరణ

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 2,(జన సంఘర్షణ )



ఎల్లారెడ్డి మండలంలోని మల్కాపూర్ గ్రామ హనుమాన్ ఆలయానికి, గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామ పెద్దలు రిటైడ్ టీచర్ కర్ణం రామకిష్టగౌడ్ కుటుంబ సభ్యులు మతమాల సొసైటి డైరెక్టర్ అరవింద్ గౌడ్, మతమాల జడ్పి హెచ్ ఎస్ ఉపాధ్యాయులు సురేష్ గౌడ్ లు గ్రామ హనుమాన్ ఆలయానికి సుమారు 30 వేల రూపాయలు టైమర్ మైక్ సెట్‌ను వితరణ చేశారు. రామకిష్టగౌడ్ శిష్యులు గ్రామ సర్పంచ్ కొండ యోగితా మధు వారి కుటుంబ సభ్యులకు శాలువాతో ఘనంగా నిర్వహించారు. వార్డ్ మెంబర్ కటికెల నారాయణ కు సైతం సన్మానించారు. పుట్టిన ఊరుకు కొంత మేలు చేయాలనే ఉద్దేశ్యంతో ఆలయానికి మైక్ సెట్ వితరణ చేసిన రామకిష్ట గౌడ్‌కు గ్రామస్తులు అభినందించారు.

# హనుమాన్ ఆలయం వద్ద అన్నశాంతి కార్యక్రమం

ఎల్లారెడ్డి ఏప్రిల్ 2 (జన సంఘర్షణ )



ఎల్లారెడ్డి పట్టణంలోని ఒకటో వార్డులో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారికి ఉదయం నుండి అభిషేకము, వస్త్రాలంకరణ, అష్టోత్రము, ఆకుపూజ, హనుమాన్ చాలీసా వంటి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగినది. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని తుమ్మల గాయత్రి శ్యాంసుందర్ ప్రారంభించారు. భక్తులు మాట్లాడుతూ ఈ ఆలయంలో ప్రతినిత్యం ధూపదీప నైవేద్యాలతో పూజలు నిర్వహించడం జరుగుతుందని, పండగ పర్వదినాల్లో ఆధ్యాత్మికమైన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వామి సేవా సమితి సభ్యులు, భక్తులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భద్రాచలం పంచగ్రామాలను తెలంగాణలో కలపాలి

◆ రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు డిమాండ్



ఇల్లందు ఏప్రిల్ 02 (జన సంఘర్షణ)
న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు-2026పై రాజ్యసభలో జరిగిన చర్చలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కీలక డిమాండ్లు వినిపించారు. ఏపీ రాజధానిగా అమరావతిని తమ పార్టీ స్వాగతిస్తోందని పేర్కొంటూనే, భద్రాచలం పట్టణాన్ని ఆనుకుని ఉన్న ఐదు గ్రామాలను (ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, పురుషోత్తమపట్నం, గుండాల) తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. భద్రాద్రి రామాలయ భూములు ఈ గ్రామాల్లోనే ఉన్నాయని, వీటిని కలపడం వల్ల ఆలయ నిర్వహణ సులభతరం అవుతుందని ఆయన వివరించారు. ఇదే సందర్భంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతిని ప్రస్తావించిన ఆయన, విభజన హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా మరియు కొత్తగూడెం రైల్వే డివిజన్ వంటి పెండింగ్ అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

# బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి

ఇల్లందు ఏప్రిల్ 02 (జన సంఘర్షణ)



ఇల్లందు బొగ్గు గని ఏరియాలో నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు, కార్మికులు సమన్వయంతో కృషి చేయాలని ఏరియా జనరల్ మేనేజర్ (జిఎం) కృష్ణయ్య పిలుపునిచ్చారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత మార్చి నెలలో నమోదైన ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. నెలకు నిర్దేశించిన 5.50 లక్షల టన్నుల భారీ లక్ష్యానికి గాను, ప్రస్తుతం 1.78 లక్షల టన్నుల (32 శాతం) బొగ్గును మాత్రమే ఉత్పత్తి చేయగలిగామని, ఈ అంతరాన్ని భర్తీ చేసేందుకు రానున్న రోజుల్లో ఉత్పత్తి వేగాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రవాణా రంగానికి సంబంధించి ఆర్.సి.హెచ్.పి ద్వారా ఇప్పటివరకు మొత్తం 2.34 లక్షల టన్నుల బొగ్గును విజయవంతంగా తరలించినట్లు పేర్కొన్న జిఎం, సాంకేతిక అవరోధాలను అధిగమిస్తూ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, సంస్థ ప్రయోజనాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసి వార్షిక లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# వీర హనుమాన్ విజయయాత్ర

బోధన్ : ఏప్రిల్ 02 జన సంఘర్షణ



బోధన్ పట్టణంలో భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వీర హనుమాన్ విజయయాత్ర లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి వారి వెంట వివిధ మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో 'చంటి' జన్మదిన వేడుకలు

◆ భగవద్గీతను బహుకరించి సత్కరించిన డీకే శ్రీను, జానకి రామ్,రాహుల్ నేత



ఇల్లందు ఏప్రిల్ 02 (జన సంఘర్షణ)
పట్టణంలో సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే చంటి జన్మదిన వేడుకలు గురువారం విశ్వహిందూ పరిషత్ నాయకులు డీకే శ్రీను ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో డీకే శ్రీను, జానకి రామ్ చంటికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, హిందూ ధర్మ ప్రతీక అయిన 'భగవద్గీత'ను బహుకరించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జన్మదిన వేడుకలు జరుపుకున్న చంటి మాట్లాడుతూ.. తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో సేవానిరతిని (సేవా దృక్పథం) అలవర్చుకోవాలని, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే నిజమైన జన్మదిన సార్థకత అని ఆయన కోరారు. ఈ వేడుకలో రాహుల్ నేత, ప్రశాంత్, రమేష్, సతీష్, వేణు తదితర ముఖ్య నేతలు కార్యకర్తలు పాల్గొని చంటికి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షల వెల్లువలో ముంచెత్తారు.

# దుప్పల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

బోధన్ : ఏప్రిల్ 02 జన సంఘర్షణ

రెంజల్ మండలం దుప్పల్లి తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ. సర్పంచ్ ద్వారా స్వాగత ప్రసంగం, పరిచయం. ముఖ్యమంత్రి సందేశం ఐ ఎన్ పి ఆర్విభాగం ద్వారా గురువారం ఉదయం అందించినది వాచనం. వివిధ శాఖల ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు మరియు సాధనలపై సమాచారం. రైతు భరోసా, ఇతర పథకాల కింద లబ్ధిదారుల పేర్ల వాచనం లబ్ధిదారుల అభిప్రాయాలు , అనుభవాలు. ప్రజా ప్రతినిధుల సందేశం మరియు తదుపరి కార్యక్రమం. గ్రామ సమస్యలు మరియు పరిష్కారాలపై చర్చ. తీర్మానాలు, కార్యాచరణ పాయింట్లు మరియు ముగింపు. బోధన్ సబ్-కలెక్టర్, రెంజల్ తహసీల్దార్ ,ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా సబ్-కలెక్టర్ క్రింది సంక్షేమ పథకాల గురించి వివరంగా వివరించారు: రైతు భరోసా, రైతు భీమా, కొత్త (రేషన్) కార్డులు, చేయూత పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల



పథకం పై పథకాలపై అభ్యర్థులు అడిగిన సందేహాలను సబ్-కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ పథకాల ప్రయోజనాలను పొందడానికి సంబంధిత అధికారులను ఎలా సంప్రదించాలో సబ్-కలెక్టర్ మార్గదర్శనం చేశారు

# వేలాదిమంది రైతుల త్యాగాల ఫలితమే అమరావతి

- ద్రావిడ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఎల్. సి. మల్లయ్య.
- ద్రావిడ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక సమావేశం.
- అమరావతి రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు.

కుప్పం,ఏప్రిల్ 02 జన సంఘర్షణ:

ద్రావిడ విశ్వవిద్యాలయంలో అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లుకు మద్దతుగా ఘన సమావేశం. ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఎన్టీఆర్ విగ్రహం సమీపం లో జరిగింది. అమరావతిని ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా చట్టబద్ధత కల్పించే బిల్లుకు పార్లమెంటులో ఆమోదం లభించిన సందర్భంగా గురువారం ఘన సమావేశం నిర్వహించబడింది. లోక్‌సభలో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2026 ఆమోదం పొందడం రాష్ట్ర చరిత్రలో ఒక విశిష్ట ఘట్టమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎల్ .సి. మల్లయ్య మాట్లాడుతూ, “అమరావతి అంటే కేవలం ఒక నగరం మాత్రమే కాదు, అది వేలాది మంది రైతుల త్యాగాల ఫలితం. అభివృద్ధికి, ఆర్థిక పురోగతికి బలమైన పునాది. తమ భూములను వేల ఎకరాల మేర సమర్పించి, అమరావతి కోసం దీర్ఘకాలంగా పోరాడి విజయం సాధించిన రైతులు అభినందనీయులు” అని పేర్కొన్నారు.ఇప్పుడు అమరావతి రాజధాని దేశవ్యాప్తంగా గౌరవప్రదమైన గుర్తింపును సంపాదించుకుందని, ఈ చట్టం అమలులోకి రావడంతో రాష్ట్ర పరిపాలనలో స్థిరత్వం ఏర్పడుతుందని, పెట్టుబడిదారుల నమ్మకం మరింత పెరుగుతుందని, ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని, రాష్ట్ర అభివృద్ధి వేగవంతమవుతుందని ఆయన తెలిపారు. ఈ బిల్లు పరిపాలనా స్పష్టతను కల్పించి పెట్టుబడులకు అనుకూల వాతావరణం సృష్టిస్తుందని కూడా తాజా నివేదికలు సూచిస్తున్నాయి. అలాగే, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలు, ముఖ్యంగా అమరావతి రైతులకు ద్రావిడ విశ్వవిద్యాలయం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్ కుమార్, అకాడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య కె. శ్యామల, వివిధ శాఖల పీఠాధిపతులు, శాఖాధికారులు, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు ఘనంగా పాల్గొన్నారు.



# చేనేత కుటుంబాలకు చంద్రబాబు తీరని ద్రోహం: మాజీమంత్రి కాకాణి

నెల్లూరు జిల్లా- జన సంఘర్షణ:

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, సర్వేపల్లి నియోజకవర్గం, పొదలకూరు మండలం, మహ్మదాపురం గ్రామంలో పర్యటించిన మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి. చేనేతలకు చంద్రబాబు తీరని ద్రోహం చేశాడని పేర్కొన్న కాకాణి గోవర్ధన్ రెడ్డి. జగన్మోహన్ రెడ్డి నేతన్న నేస్తం పేరిట చేనేత కుటుంబాలకు ప్రతి సంవత్సరం 24 వేల రూపాయల ఆర్థిక సాయం అందించాడన్న కాకాణి గోవర్ధన్ రెడ్డి. చంద్రబాబు అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంలో చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అని ప్రకటించాడన్న కాకాణి. క్షేత్రస్థాయిలో చేనేత కుటుంబాలకు చంద్రబాబు ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలయ్యే పరిస్థితి కనిపించడం లేదన్న కాకాణి. ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కండ్లకూటి రమణారెడ్డి సతీమణి శ్రీలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించిన కాకాణి.

కాకాణి కామెంట్స్: నేతన్నలకు అన్ని విధాల అండగా నిలిచిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి. నేతన్నలను కష్టాల నుండి విముక్తి కల్పించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో, జగన్మోహన్ రెడ్డి అనేక నిర్ణయాలు తీసుకున్నారు. జగన్మోహన్ రెడ్డి చేనేత కుటుంబాలకు ప్రతి ఏడాది 24 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నాడు. చంద్రబాబు నాయుడు అన్ని వర్గాలను మోసం చేసినట్లు నేతన్నలను కూడా మోసం చేశాడు. సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్ అయిన సందర్భంలో, సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ, చంద్రబాబు తనకు తానే ప్రకటించుకుంటున్నాడు.చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను బుట్ట దాఖలు చేసి, ప్రజలను మోసగించడమే ధ్యేయంగా పనిచేస్తున్నాడు. చంద్రబాబు ఇచ్చే 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు చేనేత కుటుంబాలకు ఏమాత్రం సరిపోదు. చంద్రబాబు ప్రకటించిన 200 యూనిట్లలో కనీసం 10 శాతం చేనేత కుటుంబాలకు కూడా లబ్ధి చేకూరే పరిస్థితి కనిపించడం లేదు. చంద్రబాబు ప్రభుత్వం మాటల ప్రభుత్వం, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేతల ప్రభుత్వం అంటూ, ప్రజలు భావిస్తున్నారు. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయామని, జగన్మోహన్ రెడ్డి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన తీరు గుర్తు చేసుకుంటే, చంద్రబాబుకు ఓటు వేసి ఎంత పొరపాటు చేశామా అని, అన్ని వర్గాల ప్రజలు బాధపడుతున్నారు. ఆంధ్ర రాష్ట్రంలో ఏ రోజు ఎన్నికలు వచ్చినా, మాట మీద నిలబడే జగన్మోహన్ రెడ్డి వెంట నడవడానికి ప్రజలు నిర్ణయించుకున్నారు. రాష్ట్రంలో ఏ రోజు ఎన్నికలు వచ్చినా, మాయమాటలు చెప్పి మోసగించిన , చంద్రబాబుకు తగిన శాస్తి చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ప్రజల్లోకి ఎక్కడికి వెళ్ళినా జగన్మోహన్ రెడ్డి నాయకత్వం పట్ల అత్యంత విశ్వాసాన్ని ప్రకటిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి పేరు చెబితేనే ప్రజలలో ఎక్కడలేని ఉత్సాహం ఉరకలు వేస్తుంది. అధికారం ఉన్నా, లేకపోయినా ప్రతి సమస్యలో ప్రజల పక్షాన నిలబడి, పోరాడేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిద్ధం గా ఉందని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు.



# బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
- బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

నారాయణవనం ఏప్రిల్ 02 జన సంఘర్షణ:

అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ముగ్గురు బాధితులకు గురువారం ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. నారాయణవనం మేజర్ పంచాయతీ ఎగువ పద్మశాలి వీధికి చెందిన బి.ముని శ్రీనివాసులకు 18 వేల రూపాయలు, కీలగరంకు చెందిన కె.శరవణ కు 30 వేల రూపాయలు, అరణ్యం కండ్రిగ కు చెందిన ఎస్.లక్ష్మయ్యకు 40 వేల 350 రూపాయల విలువైన చెక్కులను ముగ్గురికి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఎల్లారెడ్డిలో ఘనంగా హనుమాన్ జయంతి శోభాయాత్ర

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 2 (జన సంఘర్షణ )



హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణంలో అంజన్న శోభాయాత్ర (హనుమాన్ శోభాయాత్ర) అత్యంత వైభవంగా ప్రారంభించారు. విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ జెండా ఊపి హనుమాన్ శోభాయాత్రను ప్రారంభించారు. సాతెల్లి బేస్ నుంచి ప్రారంభమై పట్టణంలోని ప్రధాన విధుల గుండా ఆంజనేయ స్వామి రాముడు విగ్రహాలను ఊరేగించారు. కాషాయ వస్త్రాలతో, జై హనుమాన్ నినాదాలతో, మారుమోగుతున్నాయి.ఆటపాటలతో జైశ్రీరామ్.. జై హనుమాన్ నినాదాలతో పురవీధులలో భక్తి శ్రద్ధలతో పట్టణ, గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు. హనుమాన్ భక్తులు శోభాయాత్రలో ఆట, పాటలతో నృత్యాలు చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహిళలు స్వామి వారి విగ్రహాలకు మంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బందోబస్తులో పాల్గొన్న పోలీసులు...

హైదరాబాద్ సిటీ బ్యూరో /ఏప్రిల్ 2(జనసంఘర్షణ )



ఆర్టీసీ క్రాస్ రోడ్ లో హనుమాన్ శోభాయాత్రలో బందోబస్తుల పాల్గొన్న చిక్కడపల్లి ఏసిపి ఎల్ రమేష్ కుమార్, చిక్కడపల్లి ముషీరాబాద్ సిఐలు మల్లేశం రాంబాబు ఎస్ఐలు మౌనిక కరీం సీనియర్ జర్నలిస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి నగర అధ్యక్షులు చిలుకూరి అఖిలేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముధోల్ ఇంటిగ్రెటెడ్ పాఠశాల కు 200 కోట్లు నిధులు కేటాయిస్తూ జి. వో. విడుదల

- బాసర ఆలయానికి 180 కోట్ల నిధులు
- ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

ముధోల్,ఏప్రిల్ 2 (జన సంఘర్షణ)

ముధోల్ నియోజకవర్గ కేంద్రం లో ఇంటిగ్రెటెడ్ పాఠశాల కు 200 కోట్ల నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం జి. వో. విడుదల చేసినట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి కి ఎమ్మెల్యే కృతజ్ఞతలు చెప్పారు.. ఇంటిగ్రెటెడ్ పాఠశాల పూర్తయితే ఒకే చోట మూడు వేల మంది పేద విద్యార్థులకు విద్యను అందించడం జరుగుతుందన్నారు. అదే విధంగా బాసర ఆలయ పునర్నిర్మాణం, మాస్టర్ ప్లాన్ కు 180 కోట్ల నిధులు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనన్నారు.. ఈ నెల 6 న బాసరకు ముఖ్య మంత్రి రావడం శుభ సూచకమని బాసర అమ్మవారి భక్తులు పెద్ద మొత్తంలో తరలి రావాలని కోరారు.

## ఆంధ్ర ప్రదేశ్ రాజధానిగా అమరావతి ఇక శాశ్వతం

కుప్పం,ఏప్రిల్ 02 (జన సంఘర్షణ):




ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పార్లమెంటు ఉభయ సభలు చట్టబద్ధత కల్పించడంతో ఐదు కోట్ల ఆంధ్రుల చిరకాల స్వప్నం సాకారమైంది. లోక్ సభ, ఆమోదం తర్వాత, రాజ్యసభలో నూ మూజువాణి ఓటుతో ఈ బిల్లు నెగ్గడం చారిత్రాత్మక ఘట్టం. అమరావతి ఇక శాశ్వతం. ఇది కేవలం ఒక నగరం కాదు, ఐదు కోట్ల మంది గుండె చప్పుడు. భూములిచ్చిన రైతుల త్యాగాలకు దక్కిన అసలైన విజయం ఇది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతలో రూపుదిద్దుకుంటున్న ఈ కలల రాజధానికి ఇక అజేయమైన శక్తి లభించింది. విభజన కష్టాల నుంచి గట్టెక్కి, నవ్యాంధ్ర నిర్మాణంలో అమరావతి ఇక అజరామరంగా నిలిచిపోనుంది. కేంద్రం వేసిన ఈ రాజముద్రతో రాష్ట్ర భవిష్యత్తుకు భరోసా లభించింది.అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్ కొత్త చరిత్రను లిఖించబోతోంది. చరిత్రలో ఈరోజు సువర్ణ అక్షరాలతో లిఖించదగినదిగా నిలిచిపోతుంది. ఈ చారిత్రాత్మక ఆమోదం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఐటీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, కూటమి పార్లమెంట్ సభ్యులు, కూటమి శాసనసభ్యులు, ఆంధ్ర ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
03 ఏప్రిల్ 2026

# మామిడి రైతులను ఆదుకోవాలి

**కోరుట్ల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మానుక ప్రవీణ్ కుమార్**



**కోరుట్ల :**
అకాల గాలి దుమారం వానతో నష్టపోయిన మామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుట్ల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మానుక ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ మేరకు గురు వారం కోరుట్ల నియోజకవర్గం లోని కోరుట్ల, మెట్టుపల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలలో మామిడి తోటలను సందర్శించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా మానుక ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... అకాల గాలి దుమారము వర్షము కురవడంతో పెద్ద ఎత్తున మామిడికాయలు నేలరాలి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మామిడి తోటలను సందర్శించి నష్టపరిహారాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మామిడి రైతులు రాజేందర్, శంకర్, కడుమల్ల గంగారం, శేఖర్, వెంకటి, లక్ష్మీనరసయ్య, శ్రీనివాస్, జీవన్ తదితరులు పాల్గొన్నారు..

# హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులకు మజ్జిగ,పానకం పంపిణీ

**- మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు**



**కూకట్ పల్లి :**
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కూకట్ పల్లి నియోజకవర్గం వివేకా నంద నగర్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ చౌరస్తాలో హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాచర్ల భద్రయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాన్ జయంతి వంటి పర్వదినాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమల ప్రసన్న నగర్ మాజీ అధ్యక్షులు శేఖర్, ప్రదీప్ రెడ్డి, జగదీష్, రవీంద్రావు, రమేష్, నరహరి గౌడ్, మారుతి ప్రసాద్, అఖిల్, కళ్యాణ్, రాకేష్, జైహింద్, సోనాల్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. భక్తులకు చల్లని మజ్జిగ, పానకం పంపిణీ చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

# భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా శ్రీ సంజీవిని హనుమాన్ దేవాలయం 30వ వార్షికోత్సవం

**- హనుమాన్ జయంతి వేడుకలు**

**- ఆలయ చైర్మన్ గూడేపు కొండల్ రావు**



**కూకట్ పల్లి :**
కూకట్ పల్లి నియోజకవర్గం బాలాజీ నగర్లోని శ్రీ సంజీవిని హనుమాన్ దేవాలయంలో 30వ వార్షికోత్సవం మరియు హనుమాన్ జయంతి సందర్భంగా వేడుకలు భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. ఆలయ చైర్మన్ గూడేపు కొండల్ రావు మరియు గూడేపు నాగరాజు ఆహ్వానం మేరకు ప్రముఖులు యక్కంటి వెంకటరెడ్డి ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించు కున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, హనుమాన్ స్వామి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా యక్కంటి వెంకటరెడ్డి మాట్లాడుతూ, హనుమాన్ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. వేడుకలలో స్థానిక భక్తులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి భావాన్ని చాటారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించగా భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలు అందించారు.

# మండల వ్యాప్తంగా గ్రామసభలు



**అన్నపురెడ్డిపల్లి :**
అన్నపురెడ్డిపల్లి మండలం లోని 10 గ్రామపంచాయతీ లలో ప్రజా పాలన- ప్రగతి పణాళిక లో భాగంగా గ్రామసభ లు సర్పంచుల అధ్యక్షతన నిర్వహిం చడం జరిగింది. ఇట్టి గ్రామసభ లో ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలు అయిన రైతు భరోసా ఇందిరమ్మ ఇండ్లు మహాలక్ష్మి, మహిళలకు ఉచిత బస్సు , 500/-రూపాయల కే సబ్సిడీ గ్యాస్ గృహజ్యోతి సన్నరకం వరికి బోనస్ చేయుత పెన్షన్ లు కళ్యాణలక్ష్మి ఇందిరా మహిళా శక్తి వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరెలు కొత్త రేషన్ కార్డులు మొదలగు అంశాలు పైన ప్రగతి నివేదికలు ఆయా శాఖల అధికారులు చదివి వినిపించడం జరిగింది, అలాగే కొత్తగా రాబోయే పథకాలు మధ్యాహ్న భోజనం ఇంటర్మీడియట్ వరకు పొడిగింపు అల్పాహారం పథకం ప్రీ ప్రైమరి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంటర్మిడియేట్ చదువుతున్న దివ్యంగులకు మోటారైజడ్ వాహనాలు పంటల వైవిద్యకరణ, ప్రకృతి సేంద్రియ వ్యవసాయం ఇందిరమ్మ కుటుంబజీవిత బీమా పథకంల గురించి గ్రామసభలో తెలియజేయటమైనది ఇట్టి గ్రామసభలలో మండల స్పెషల్ అధికారి అరుణ భారతి, అందరూ సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీడీఓ, ఎంపీవో, వ్యవసాయ అధికారి, తహసీల్దార్ఏ ఈ , ఇరిగేషన్, ఏఈ , ఏ ఈ ట్రాన్సకో, ఏ ఈ హౌసింగ్, ఎంఈఓ ఎంపీ ఓ ఎపిఎం ఆర్టీసీ ఐసిడిఎస్, మెడికల్ అన్ని జి. పి ల పాలకవర్గం సభ్యులు, పెద్దలు, యూత్ తదితరులు పాల్గొన్నారు.

# ఏన్కూర్లో బ్యాంకులకు టోకరా

- **గోల్డ్ అప్రైజర్తో కుమ్మక్కై భారీ మోసం...నలుగురు అరెస్ట్**
- **రూ.9.53 లక్షల బ్యాంకు రుణం కాజేసిన ముఠా**
- **బ్యాంకు వేలంలో బయటపడిన నకిలీ బంగారం**

**ఏన్కూర్ :**
కల్లూరు డివిజన్ పరిధిలోని ఏన్కూర్ పోలీస్ స్టేషన్ హద్దుల్లో నకిలీ బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి బ్యాంకు రుణాలు పొందిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. ఈ విషయాన్ని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు.తెలంగాణ గ్రామీణ బ్యాంకు, ఏన్కూర్ శాఖ నిర్వాహకుడు కె.వి. ప్రశాంత్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా 2024 సంవత్సరంలో బంగారు ఆభరణాల విలువ నిర్ధారించే అధికారి (గోల్డ్ అప్రైజర్) శ్రీపాది సతీష్, శ్రీపాది మౌనిక, రామచంద్రోజు జయమ్మ, రామచంద్రోజు నరేష్లు కలిసి సుమారు 242.25 గ్రాముల నకిలీ బంగారు ఆభరణాలను అసలైనవిగా చూపించి రూ. 9,53,000 విలువైన రుణాలను పొందినట్లు పోలీసులు గుర్తించారు.తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో సంబంధిత ఖాతాలు నిరర్థక ఆస్తులుగా (NPAs) మారాయి. అనంతరం బ్యాంకు అధికారులు వేలం ప్రక్రియ చేపట్టగా తాకట్టు పెట్టిన ఆభరణాలు నకిలీవని బయటపడింది. దీంతో బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ కేసులో నిందితులైన శ్రీపాది సతీష్, రామచంద్రోజు జయమ్మ, రామచంద్రోజు నరేష్లను పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. మరో నిందితురాలు శ్రీపాది మౌనిక పరారీలో ఉన్నట్లు



సమాచారం.ఇలాంటి మోసపూరిత చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఏసీపీ వసుంధర యాదవ్ హెచ్చరించారు. ప్రజలు బ్యాంకింగ్ లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.

# రోడ్డు భద్రత సైబర్ నేరాలు,డ్రగ్స్ గంజాయి,పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- చంద్రుగొండ ఎస్సై శివరామకృష్ణ**

**- మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు**

**చంద్రుగొండ :**
ప్రతిరోజు సమాజంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, అలాగే సైబర్ నేరాలు, డ్రగ్స్, గంజాయి, పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చంద్రుగొండ ఎస్సై శివరామకృష్ణ సూచించారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చంద్రుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని గ్రామస్తులకు రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్, గంజాయి, పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొంతమంది యువకులు మద్యం మత్తులో రోడ్డు భద్రత నియమాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఎక్కువ శాతం మద్యం మత్తులో జరుగుతున్నాయన్నారు. దానికి ఉదాహరణ ఘటన కెవిఆర్ ట్రావెల్ బస్ యాక్సిడెంట్ అన్నారు. మద్యం మత్తు, ప్రజల నిర్లక్ష్యం వల్ల భారీ ప్రాణ నష్టం



జరిగిందన్నారు. అలాగే ఫ్రీ మనీ కోసం సైబర్ నేరగాళ్లు మనకు సోషల్ మీడియాలో ద్వారా అనేక రకాల ఉత్పత్తులు చూపించి మన మైండ్ ను తప్పుదోవ పట్టిస్తూ ఆ ప్రోడక్ట్ ను కొనే విధంగా చేసి కొన్ని లింకులు పంపిస్తారని ఆ లింకులు క్లిక్ చేయడం ద్వారా మన బ్యాంకుల్లో ఉన్న డబ్బులను లూటీ చేసే అవకాశం ఉందన్నారు. అలాగే మీ బ్యాంకు ఎకౌంటు నెంబర్ ఇస్తే మా బంధువులు డబ్బులు ట్రాన్స్ఫర్ చేస్తారని. అందులో మీకు 10 పర్సెంట్ కమిషన్ ఇస్తామనంగానే ఎంతోమంది నమ్మి వారి అకౌంట్ నెంబర్లను ఇస్తున్నారని. అలా ఇచ్చిన వారందరూ ఈరోజు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి కటకటాల పాలు అయ్యారని గుర్తు




చేశారు. ఈ ఘటన ఇటీవల మన మండలంలో కూడా జరిగిందన్నారు. అలాగే డ్రగ్స్ గంజాయి సేవించడం, విక్రయించడం వల్ల తమ నిండు జీవితాన్ని కోల్పోవడమే కాకుండా కేసుల పాలయే అవకాశం ఉంటుందన్నారు. కావున ప్రజలందరూ ఎప్పటికప్పుడు సైబర్ నేరాల పట్ల రోడ్డు భద్రత నియమాల పట్ల అవగాహన పెంచుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, ఎంపీడీవో బయ్యారపు అశోక్, మండల విద్యాశాఖ అధికారి సూరయ్య, సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, ఉపసర్పంచ్ అంతటి రామకృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు చేదోడుగా ‘ఉచిత బస్సు’ సౌకర్యం

**పేద కుటుంబాల ఉపాధికి ఊతమిచ్చిన ఉచిత ప్రయాణం**

**ఆర్థిక స్వాలంబన దిశగా మహిళల అడుగులు**

**శ్రమశక్తికి వెన్నుదన్నుగా నిలుస్తున్న ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం**

**ప్రతిరోజూ 35 లక్షల మంది మహిళలకు లబ్ధి**

**రాష్ట్రవ్యాప్తంగా 290 కోట్లకు చేరిన జీరో ఛార్జీ టిక్కెట్లు**

**ఉచిత ప్రయాణంతో మహిళలకు రూ.10,000 కోట్ల ఆదా**

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**

**కొత్తగూడెం :**
మహిళా సాధికారతకు చేదోడుగా ఉచిత బస్సు సౌకర్యం ఎంతగానో తోడ్పడుతుందని, ఈ పథకం పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీ ఆరుగ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత



ప్రయాణ సౌకర్యం కల్పించిన నేపథ్యంలో, గురువారం కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ‘99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక’ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం మహిళల ఆర్థిక స్వాలంబన దిశగా గొప్ప అడుగు అని, నిత్యం కష్టపడే శ్రమశక్తికి ఇది వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆయన కొనియాడారు. ఈ సౌకర్యం వల్ల మహిళలు తమ పనుల నిమిత్తం ప్రయాణించేటప్పుడు ఛార్జీల భారం తగ్గి, ఆ మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు కూడా ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని, నిత్యం విధులకు వెళ్లే వారికి ఇది పెద్ద ఊరటనిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు



290 కోట్ల జీరో ఛార్జీ టిక్కెట్లు నమోదయ్యాయని, దీనివల్ల మహిళలకు సుమారు రూ. 10,000 కోట్ల మేర ప్రయాణ ఖర్చులు ఆదా అయ్యాయని వెల్లడించారు. ఈ పథకం మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు మార్కెటింగ్, ఇతర ఉపాధి పనులకు వెళ్లేందుకు ఇది ఒక వరమని ఆయన పేర్కొన్నారు. ప్రజాపాలనలో భాగంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం మరింత కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకొని లబ్ధిపొందిన పలువురు మహిళలను ఎమ్మెల్యే శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కందుల భాస్కర్, వంగ వెంకట్, డిపో మేనేజర్ రాజ్య లక్ష్మి, డిప్యూటీ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సిబ్బంది వై నాగేశ్వర్ రావు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ సమస్యల పరిష్కారం

**కూకట్పల్లి :**
వివేకానంద నగర్ డివిజన్ పరిధిలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధి లో రోడ్లపై పేరుకుపోయిన మట్టిప్పలు చేసే కార్యక్రమానికి ముఖ్య అతిథి ఆల్విన్ కాలనీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి సిబ్బంది పాల్గొని శుభ్రం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ మా కాలనీ సమస్యలు విజయవంతం చేయుటకు మున్సిపల్ అధికారులు అందుబాటులో ఉండి ఏ సమస్య అయినా క్షణాల్లో పరిష్కరించడానికి శ్రేయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నర్సింగరావు, సూర్యనారాయణ, శ్రీధర్, ప్రసాద్, కమిటీ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.



Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co